ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేషిస్తూ మున్ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక
సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.
ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి
EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

FRIDAY 04TH SEPTEMBER 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 170 COST : 3\- KHAMMAM, TELANGANA

శుక్రవారం 04 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక :170 వెల : రూ. 3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## భీమ్‌రెడ్డిపై ఈడీ మనీలాండరింగ్ కేసు

- బినామీల పేర్లతో 20కి పైగా చర, స్థిరాస్తులు
- పలు ప్రాంతాల్లో భారీగా బినామీ ఆస్తులు
- పక్కా ఆధారాలు సేకరిస్తున్న అధికారులు

హైదరాబాద్,సెప్టెంబర్3 దాయానికి మించిన ఆస్తుల కేసులో సస్పెన్షన్‌కు గురైన డీఎస్పీ భీమ్‌రెడ్డిపై, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించింది. అక్రమ ఆస్తులను కూడబెట్టిన కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు గతనెల 6న డీఎస్పీ భీమ్‌రెడ్డిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ అరెస్ట్ అనంతరం ఏసీబీ అధికారులు నిర్వహించిన సోదాల్లో కీలకమైన అస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. భీమ్‌రెడ్డి విధి నిర్వహణలో ఉండగా అక్రమ మార్గాల్లో దాదాపు రూ.150 కోట్ల

# కొండా సురేఖ బర్తరఫ్

- మంత్రివర్గం నుంచి ఉద్వాసన
- రాజీనామాకు నిరాకరించిన సురేఖ
- బర్తరఫ్ నిర్ణయం తీసుకున్న రేవంత్
- గవర్నర్‌కు సిఎం రేవంత్ రెడ్డి లేఖ
- సిఎం నిర్ణయానికి హైకమాండ్ ఓకే..
- చిన్నారెడ్డి పైనా కాంగ్రెస్ పార్టీ వేటు



హైదరాబాద్,సెప్టెంబర్3 తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహించిన పరిణామమే చోటుచేసుకుంది. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమెను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేందుకు ప్రతిపాదించిన అధికారిక సిఫార్సు లేఖను సీఎంఓ ఇప్పటికే గౌరవ గవర్నర్‌కు పంపించింది. కొంత కాలంగా కొండా సురేఖ వ్యవహారశైలి ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బందికరంగా మారింది. సీఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరికి సీఎం కుటుంబసభ్యులను టార్గెట్ చేయడం, కొండా సురేఖ కుమార్తె సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ పదవుల నుంచి తప్పించాలని సిఫారసు చేయడంతో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో పరిపాలనాపరమైన, నామినేటెడ్ పదవుల్లో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ జి. చిన్నారెడ్డి నియామకాన్ని రద్దు చేస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్, కేకే కుమార్తె గద్వాల్ విజయలక్ష్మిని ప్రణాళికా సంఘం నూతన వైస్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.మహిళా సంబంధిత రంగాలు, అభివృద్ధి సంస్థలకు కూడా నూతన సారథులను ప్రకటిస్తూ ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద నియామకానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత శారదకు ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆ వర్గానికి పెద్దపీట వేసినట్లయింది. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి సంబంధించి కీలకమైన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పీఠాన్ని కూడా భర్తీ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కుడా ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కొండా సురేఖను తప్పించినందున ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయంలో సుధారాణికి ఈ ప్రాధాన్యత ఇచ్చారు. కేబినెట్ నుంచి కొండా సురేఖ తొలగింపు మరియు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ రాష్ట్ర రాజకీయంలో సంచలనంగా మారింది. ప్రభుత్వ నిర్ణయంపై కొండా సురేఖ వర్గీయుల ప్రతిస్పందన ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారగా, రేవంత్ రెడ్డి మాత్రం తన నిర్ణయాలతో పాలనపై మరియు పార్టీపై తనకున్న పూర్తి పట్టును స్పష్టం చేశారు. రాజీనామా చేయాలని అధిష్టానం సూచించినా వెనక్కి తగ్గని కొండా సురేఖపై నేరుగా బర్తరఫ్ వేటు వేయడం, అదే సమయంలో

➢ మిగతా 2వ పేజిలో..

## కేబినేట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత..

- సురేఖ, చిన్నారెడ్డి స్థానంలో కొత్త వారికి చాన్స్
- ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా గద్వాల విజయ లక్ష్మి
- రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద
- కుడా ఛైర్ పర్సన్ గా గుండు సుధారాణికి చాన్స్
- బీసీ వర్గానికి చెందిన మహిళలకు అవకాశం



హైదరాబాద్, సెప్టెంబర్3 రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి. చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద నియమితులయ్యారు. తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు సంబంధించిన వివాదం నడుస్తున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘా రెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా చిన్నారెడ్డి కూడా విమర్శల పాలయ్యారు. కొండా సురేఖ తన పైన చర్యల సమయంలో బీసీ కార్డు తెర మీదకు తెచ్చారు. దీంతో.. చిన్నారెడ్డి పైనా చర్యలు వెంటనే తీసుకున్నారు. ఇదే సమయంలో బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ వీరి స్థానం లో కొత్త నియామకాలు చేపట్టారు. చిన్నారెడ్డి స్థానంలో సీనియర్ నేత కేకే కుమార్తె గద్వాల విజయ లక్ష్మికి ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ గా బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సురేఖ ను బర్తరఫ్ చేయటం తో

➢ మిగతా 2వ పేజిలో..



## చట్టబద్ధతోనే దత్తత ప్రక్రియ

- అక్రమ దత్తతకు వీలులేదు
- రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు

హైదరాబాద్,సెప్టెంబర్3: రాష్ట్రంలో బాలల సంరక్షణ కేంద్రాలు, సంక్షేమం, పునరావాసానికి సంబంధించిన వ్యవస్థల పనితీరుకు సంబంధించిన వివరాలపై హైకోర్టు బుధవారం ఆరా తీసింది. అక్రమ దత్తతకు సంబంధించిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా చట్టబద్ధ దత్తత ప్రక్రియ

➢ మిగతా 2వ పేజిలో..

# నన్ను తొలగించడం కుట్రే..

- రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు
- నన్ను తొలగించకపోతే తప్పుకుంటానన్నారు
- బ్లాక్‌మెయిల్ చేసి నన్ను బర్తరఫ్ చేయించారు
- కాంగ్రెస్‌పార్టీలోనే ఉంటా.. నేను పార్టీ మారను
- నా కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని
- రాజీనామా చేయమని నన్నెవరూ అడగలేదు
- బీసీ మహిళా మంత్రిగా అణచివేతకు గురయ్యా
- నిర్ణయంపై రేవంత్ ఆత్మపరిశీలన చేసుకోవాలి
- బర్తరఫ్ పై మీడియా సమావేశంలో కొండా సురేఖ
- అధిష్టానానికి పంపిన లేఖ కొండా సురేఖ రిలీజ్



హైదరాబాద్,సెప్టెంబర్3 మంత్రి పదవి నుంచి తనను తొలగించడంపై కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సురేఖను తొలగించకపోతే తాను తప్పుకొంటానని అధిష్ఠానాన్ని రేవంత్ బెదిరించారని ఆమె వ్యాఖ్యానించారు. లోక్‌భవన్ నుంచి

➢ మిగతా 2వ పేజిలో..


## ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం

- ఏ దేశమూ ఇరాన్‌కు సహాయం చేయకూడదు
- ఇరాన్‌కు సాయం చేసే దేశాలపై ఆంక్షలు విధిస్తాం
- ఇరాన్‌తో వాణిజ్యంపై భారత్‌కు అమెరికా హెచ్చరిక!
- మోదీ, ఇరాన్ అధ్యక్షుడు భేటీ నేపథ్యంలో వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3 ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అయితే, అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి

➢ మిగతా 2వ పేజిలో..




## నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు భారీ ఊరట

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3 న్యాయ విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే చట్టపరమైన అధికారం భారత బార్ కౌన్సిల్ (బీసీఐ)కు లేదని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. ఈ మేరకు నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు భారీ ఊరటనిస్తూ కీలక తీర్పు వెలువరించింది. బీసీఐ అధికార పరిధి కేవలం న్యాయవాదులుగా నమోదైన వారికి మాత్రమే పరిమితమని, విద్యార్థి దశలో ఉన్నవారికి ఇది వర్తించదని ధర్మాసనం

➢ మిగతా 2వ పేజిలో..

## ట్రంప్‌నకు మరోసారి ఎదురుదెబ్బ

జన్మతః పౌరసత్వ ఆంక్షల ఆదేశాలు నిలిపివేసిన కోర్టు



హైదరాబాద్,సెప్టెంబర్3 జన్మతః పౌరసత్వంపై అమెరి కా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరోసారి న్యాయస్థానంలో చుక్కెదు రైంది. అమెరికాలో జన్మించే విదేశీ వలసదారుల పిల్లలకు సహజంగా లభించే పౌరసత్వంపై ఆంక్షలు విధించేందుకు ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వుల

➢ మిగతా 2వ పేజిలో..

## నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు భారీ ఊరట

తేల్చి చెప్పింది. నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ కొందరు విద్యార్థులు లేఖ రాశారు. ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన బీసీఐ ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా, మూడు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని నల్సార్ వైస్-ఛాన్సలర్‌ను ఆదేశించారు. అంతటితో ఆగకుండా, నల్సార్ 2026 బ్యాచ్‌కు చెందిన ఏ విద్యార్థినీ న్యాయవాదిగా నమోదు చేసుకోవద్దని దేశంలోని అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు రావడంతో మనన్ కుమార్ మిశ్రా ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకున్నారు. అయినప్పటికీ, ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా బీసీఐ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టిన ధర్మాసనం, విద్యార్థులపై చర్యలు తీసుకునే అధికారం బీసీఐకి లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో నల్సార్ విద్యార్థులకు పెద్ద ఉపశమనం లభించింది.

# ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3 ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అయితే, అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. “భారత్, ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం ఉందని నేను అనుకోవడం లేదు” అని రూబియో ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అయితే, ప్రపంచంలోని చాలా దేశాలు తమ విదేశాంగ విధానాలను స్వతంత్రంగా రూపొందించుకుంటాయని, ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతాయని ఆయన అంగీకరించారు. అవసరమైనప్పుడు ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులతో తాము కూడా చర్చలు జరిపినట్లు ఆయన గుర్తుచేశారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన హెచ్చరికను రూబియో పునరుద్ఘాటించారు. “అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సాయం చేయకూడదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి, అణ్వాయుధాన్ని నిర్మించడానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను ఇరాన్‌కు కల్పించకూడదు. ఒకవేళ ఏవైనా దేశాలు అలా చేస్తే, వాటిపై కూడా మేము ఆంక్షలు విధించాల్సి వస్తుంది” అని రూబియో హెచ్చరించారు. ట్రంప్ యంత్రాంగం ప్రధాన లక్ష్యం ఇరాన్‌ను అణ్వాయుధ శక్తిగా మారకుండా నిరోధించడమేనని రూబియో స్పష్టం చేశారు. “అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్నంత కాలం ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారేందుకు ఎప్పటికీ అనుమతించం” అని ఆయన అన్నారు. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రాథమికంగా ఆర్థిక ఆంక్షలను ఉపయోగిస్తామని, అయితే అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన తెలిపారు. ఇరాన్ తన ఆర్థిక వనరులను దేశ ప్రజల సంక్షేమానికి కాకుండా ఉగ్రవాదం, అణ్వాయుధాల కోసమే ఖర్చు చేస్తోందని రూబియో ఆరోపించారు. గత ఆరు నెలలుగా పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇటీవలి వారాల్లో ఇరు దేశాల మధ్య ఘర్షణలు పెరిగాయి. ఇరాన్ లక్ష్యాలపై రాత్రికి రాత్రే భారీ దాడులు చేశామని, అవసరమైతే మరోసారి దాడికి సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మరోవైపు, ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. తమ దేశం యుద్ధరంగంలో, దౌత్యపరంగా, ఆర్థిక దిగ్బంధనాన్ని ఎదుర్కోవడంలో కొత్త వ్యూహాన్ని అవలంబించిందని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహసెన్ రెజాయి హెచ్చరించారు. తమ కొత్త వ్యూహం అమెరికా పునాదులను కదిలిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

## కొండా సురేఖ బర్తరఫ్

కీలక నామినేటెడ్ పోస్టులను నింపడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన రాజకీయ, పరిపాలనా ముద్రను బలంగా చాటుకుంది. సురేఖ న్యూదిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి, తనపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను తీవ్రంగా ప్రశ్నించిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై పార్టీ చర్య తీసుకోవాలనుకుంటే, ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే ‘షో-కాజ్ నోటీసు’ (వివరణ కోరే నోటీసు) జారీ చేయాలని ఆమె వాదించారు. ముఖ్యమంత్రి, ఇతర కాంగ్రెస్ నాయకులపై సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో, సురేఖపై చర్యలు తీసుకుంది. ఈ వ్యవహారం ఇప్పుడు ముఖ్యమంత్రికి, కొండా కుటుంబానికి మధ్య ప్రత్యక్ష ఘర్షణగా మారింది. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన దిల్లీ పర్యటన ముగించుకుని ఈ సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు. ఆయన శంషాబాద్ విమానాశ్రయం నుండి నల్గొండ క్రాస్ రోడ్స్‌కు చేరుకుని, అక్కడ చంచల్‌గూడ-సంతోష్ నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

# కేబినేట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత..

ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) ఛైర్ పర్సన్ గా నియమించారు. ఇక.. సురేఖ స్థానంలో కేబినెట్ లోకి బీసీ వర్గానికి చెందిన మహిళకు అవకాశం ఇవ్వనున్నారు. ఈ స్థానంలో కొత్త మంత్రి గా ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తి గా మారింది. ఇక.. ఢిల్లీ కేంద్రంగా జరిగిన చర్చల్లో వీరిద్దరి పైనా చర్యలు తీసుకోవాలని రేవంత్ పట్టు బట్టినట్లు తెలుస్తోంది. ఫలితంగా హైకమాండ్ ఆమోదంతో వేటు వేసారు.

## మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలి

కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలి

బీజేపీకి మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్

హైదరాబాద్,సెప్టెంబర్3 తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు.

# భీమ్‌రెడ్డిపై ఈడీ మనీలాండరింగ్ కేసు

విలువైన ఆస్తులను సంపాదించుకున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆయనతో పాటు బీనామీల పేర్లతో 20కి పైగా చర, స్థిరాస్తులు కల్గి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. భీమ్‌రెడ్డి సంపాదించిన ఈ భారీ అస్తులు కేవలం ఒకే ప్రాంతానికి పరిమితం కాకుండా పలు ప్రాంతాల్లో విస్తరించి ఉన్నట్లు తేల్చారు. మణికొండ, గచ్చిబౌలి, తెల్లాపూర్, పటాన్‌చెరు, నాగోలు, మోమిన్‌పేట్, జహీరాబాద్, కర్ణాటకలోని బెంగళూరులోనూ ఖరీదైన ఆస్తులను గుర్తించారు. ఈ ఆస్తుల్లో సింహభాగం నేరుగా ఆయన పేరు మీద కాకుండా బినామీల పేర్లపై కొనుగోలు చేసినట్లు ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది. ఏసీబీ దర్యాప్తులో భారీగా బినామీ ఆస్తులు బయటపడటంతో ఈ అంశంపై ఈడీ దృష్టిసారించింది. అవినీతి ద్వారా అక్రమంగా సంపాదించిన మనీలాండరింగ్ ఏ విధంగా మళ్లించారనే కోణంలో ఈడీ అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు. ఆస్తుల కొనుగోలు తీరు, భారీ నగదు లావాదేవీలు, ఆ నిధుల మూలాలపై పక్కా ఆధారాలను ఈడీ అధికారులు సేకరిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ఆదాయపు పన్ను శాఖ బినామీ ప్రొహిబిషన్ యూనిట్ కూడా భీమ్‌రెడ్డిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతోంది. ఈడీ దర్యాప్తు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో, త్వరలోనే భీమ్‌రెడ్డితో పాటు ఆయన బినామీలకు కూడా ఈడీ అధికారులు విచారణ నిమిత్తం నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భీంరెడ్డి నివాసముంటున్న విల్లాను 2024లో రూ.4.5 కోట్ల రిజిస్ట్రేషన్ వాల్యూతో కొనుగోలు చేసినప్పటికీ ఇంకా రిజిస్ట్రేషన్ పూర్తి చేయలేదని కొద్ది రోజుల క్రితం నిర్వహించిన సోదాల్లో ఏసీబీ గుర్తించింది. గచ్చిబౌలి జయభేరి పైన్ వ్యాలీలోని 3400 చదరపు అడుగుల క్రాంతి సియోన్ అపార్ట్?మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌ను బినామీ విష్ణువర్ధన్ రెడ్డి పేరుతో కొనుగోలు చేయించినట్లు ఏసీబీ గతంలో తెలిపింది. 2023లో పటాన్‌చెరు డీఎస్పీగా పని చేస్తున్న సమయంలో ముత్తంగిలో రెండు ఇళ్లు కొనుగోలు చేసి బినామీ ఇంద్రకరణ్‌రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించినట్లుగా తేలింది. ప్రస్తుతం ఉపయోగిస్తున్న కారు సురేశ్? అనే బినామీ పేరుతో కొనుగోలు చేసినట్లు అవినీతి నిరోధక శాఖ గుర్తించింది. 2007లో గచ్చిబౌలి టెలికాంనగర్‌లోని 244 గజాల ప్లాటును తన తండ్రి పేరుతో కొనుగోలు చేయించి, 2010లో గిఫ్ట్ సెటిల్‌మెంట్ ద్వారా తిరిగి తన పేరుకు మార్చుకున్నాడు. 2012లో ఓ ఇంటిని రూ.45 లక్షలకు కొని అదే స్థలంలో జీ-ప్లస్ 12తో పాటు పెంట్ హౌస్ నిర్మించి తన ఆధీనంలోనే ఉంచుకున్నాడు. ఆస్తి పన్ను, విద్యుత్ బిల్లులు ఇప్పటికీ భీంరెడ్డి పేరుతోనే చెల్లిస్తున్నట్లు ఏసీబీ గుర్తించింది.

# చట్టబద్ధతోనే దత్తత ప్రక్రియ

తప్పనిసరని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. 2 మాసాల నుంచి మూడేళ్ల వయసున్న చిన్నారులు అక్రమ దత్తతకు గురైనట్లుగా ఆరోపణలతోపాటు నమోదైన ఎఫ్‌ఐఆర్‌లలో అసలైన తల్లిదండ్రులను గుర్తించడంలో పోలీసుల వైఫల్యాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. ఈ మేరకు డీఎన్‌ఏ శాంపిల్స్ సేకరణ వంటి శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలంటూ హోంశాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో వారంలోగా నివేదికను దాఖలు చేయాలని ఆదేశించింది. 2023లో దత్తత తీసుకున్న ఓ చిన్నారిని పోలీసులు స్వాధీనం చేసుకుని స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అప్పగించడాన్ని సవాల్ చేస్తూ నల్గొండ జిల్లా సూరారం మండలానికి చెందిన ఎం.వెంకన్న దంపతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. దీనిపై విచారించిన సింగిల్ జడ్జి రూల్స్?కు విరుద్ధంగా జరిగిన దత్తతను అనుమతించలేమంటూ పిటిషన్‌ను కొట్టివేయడంతో వెంకన్న అప్పీల్ చేశారు. ఈ పిటిషన్?పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా హోంశాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్?తో పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రు తి ఓజా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేందిర బోయిలు వర్చువల్?గా హాజరై సమాధానాలిచ్చారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి నివేదిక సమర్పించేందుకు సీనియర్ న్యాయవాది బి.మయూర్‌రెడ్డిని అమికస్ క్యూరీగా హైకోర్టు నియమిస్తూ విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం ప్రశ్నలకు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రుతి ఓజా సమాధానమిస్తూ అనాథలను గుర్తించి సాయం అందిస్తున్నామని తెలిపారు. అన్ని జిల్లాల్లో సీడబ్ల్యూసీ కమిటీలను 2 నెలల్లో పూర్తిచేస్తామని కోర్టుకు విన్నవించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 291 బాలల సంక్షేమ గృహాలుండగా, అందులో ప్రైవేటు ఆధ్వర్యంలో 231, ప్రభుత్వ ఆధ్వర్యంలో 60 నడుస్తున్నాయన్నారు. నేరాలకు పాల్పడిన, శిక్ష పడిన బాలల కోసం ప్రత్యేకంగా 35 సంరక్షణ కేంద్రాలున్నాయని శృతి ఓజా కోర్టుకు తెలిపారు. ఆరేళ్లలోపు పిల్లల కోసం ప్రత్యేక దత్తత కేంద్రాలు 17 ఉన్నాయని శృతిఓజా వివరించారు. అనాథలుగా, ఎవరైనా అప్పగించడం ద్వారా దొరికిన చిన్నారులను సీడబ్ల్యూసీ ముందు హాజరుపరచి, ప్రత్యేక దత్తత కేంద్రాల్లో ఉంచుతామన్నారు. నిబంధనల ప్రకారం సామాజిక దర్యాప్తు జరిపించి దత్తతకు అర్హులైనవారి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తామని ఆమె న్యాయస్థానానికి వివరించారు. పిల్లల సంక్షేమాన్ని శిశు సంక్షేమ శాఖ చూసుకుంటుందని, కేసుల్లో దర్యాప్తును మాత్రమే తాము చేపడతామంటూ హైకోర్టుకు శిఖాగోయల్ తెలిపారు. తమ శాఖలో ఎస్సీ, ఎస్టీ పిల్లల సంక్షేమాన్ని చూస్తామని విజయేందిర బోయి వివరించారు.

## ట్రంప్‌నకు మరోసారి ఎదురుదెబ్బ

అమలును యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు నిలిపివేసింది. ‘బర్త్ టూరిజం’ను అడ్డుకోవడంతో పాటు, అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసాలపై ఉన్నవారి పిల్లలకు జన్మతః పౌరసత్వం లభించకుండా పరిమితులు తీసుకురావాలని ట్రంప్ ఇటీవల కొత్త ఉత్తర్వులపై సంతకం చేసిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై ఇటీవల ట్రంప్‌నకు సుప్రీంకోర్టులోనూ ఎదురుదెబ్బ తగిలింది. అమెరికాలో జన్మించిన పిల్లలకు వారి తల్లిదండ్రుల వలస స్థితితో సంబంధం లేకుండా పౌరసత్వ హక్కు కల్పించే రాజ్యాంగ నిబంధనలను ట్రంప్ పరిమితం చేయాలని ప్రయత్నించారు. అయితే ఆంక్షలపై న్యాయపరమైన వివాదం కొనసాగుతుండగా, ఆయన తీసుకొచ్చిన తాజా ఉత్తర్వులపైనా కోర్టు జోక్యం చేసుకుంది. దీంతో విదేశీ వలసదారుల పిల్లలకు జన్మతః పౌరసత్వాన్ని నిరాకరించాలన్న ట్రంప్ ప్రభుత్వ ప్రయత్నాలకు మరోసారి అడ్డంకి ఏర్పడింది. వాషింగ్టన్ డిసి ఫెడరల్ కోర్టులో జరిగిన ఈ విచారణలో జడ్జి డెబోరా బోర్డ్‌మన్ కీలకమైన అంశాలను ప్రస్తావించారు. ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ నూతన విధానం గత వేసవిలో అమెరికా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పునకు విరుద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

## నన్ను తొలగించడం కుట్రే..

అధికారిక ప్రకటన ఇంకా వెలువడకముందే.. తన బర్తరఫ్‌ను ఆమె ధ్రువీకరించారు. ఈ సందర్భంగా టీవీ9తో మాట్లాడిన సురేఖ పలు కీలక విషయాలను వెల్లడించారు. తనను తొలగించే ముందు కనీసం ఒక్క మాట కూడా చెప్పలేదని సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. తన వివరణ కూడా తీసుకోలేదని, రాజీనామా చేయాలని కూడా ఎవరూ చెప్పలేదన్నారు. అధిష్ఠానం నుంచి తనకు ఎలాంటి సమాచారం రాలేదని చెప్పారు. తనతో మాట్లాడి వివరణ తీసుకుని ఉండాల్సిందని అన్నారు. తనపై వేం నరేందర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, కొండల్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి కుట్ర చేశారని సురేఖ ఆరోపించారు. అయితే తదుపరి కార్యాచరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. తాను తప్పు చేశాననే భావన లేదన్నారు. తన కుమార్తె కొండా సుస్మిత మాట్లాడిన మాటలను పొంగులేటి సుధాకర్‌రెడ్డి రాజకీయంగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. సుస్మిత స్వతంత్ర వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అని, ఆమె అభిప్రాయాలను తాము ఖండించాల్సిన అవసరం లేదన్నారు. ఆమెతో తాము మాట్లాడించలేదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డిని చాలామంది విమర్శిస్తున్నా.. తన విషయంలోనే ఎందుకు ఇంత తీవ్రంగా స్పందించారో సీఎం ఆత్మపరిశీలన చేసుకోవాలని సురేఖ అన్నారు. రేవంత్ పీసీసీ అధ్యక్షుడు కావాలని కోరుకున్నవారిలో తామే ముందున్నామని గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత తాను ఎక్కువగా అభిమానించింది రేవంత్‌రెడ్డినేనని చెప్పారు. ప్రస్తుతం పార్టీ మారే ఆలోచన లేదని సురేఖ స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై తమకు అభిమానం ఉందన్నారు. 2018లో కూడా ఇదే “దుష్టశక్తులు” తనకు టికెట్ రాకుండా అడ్డుకున్నాయని, అందుకే అప్పట్లో బీఆర్‌ఎస్ వైపు చూడాల్సి వచ్చిందని చెప్పారు. అన్ని విషయాలను కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు వివరించినట్లు వెల్లడించారు. ఉరిశిక్ష పడిన ఖైదీని కూడా చివరి కోరిక అడుగుతారన్న కొండా సురేఖ తనను మాత్రం ఏ వివరణ అడగకుండానే తొలగించారని, తనను ఇలా ఏకపక్షంగా తొలగించటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తనను తొలగించడం అధిష్ఠానానికి కూడా ఇష్టం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి తనని బర్తరఫ్ చేయిస్తున్నారని, ‘బర్తరఫ్ చేస్తారా? నన్ను వెళ్లిపోమ్మంటారా’ అని అధిష్ఠానాన్ని బ్లాక్‌మెయిల్ చేశారని ఆమె ఆరోపించారు. తన మీద, తన మాజీ ఓఎస్‌డీ మీద కుట్రలు చేస్తున్నారని, దీని వెనక వేం నరేందర్‌రెడ్డి, పొంగులేటి, కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మరికొందరు ఉన్నారన్నారు. అందరూ కలిసి కావాలని కక్షగట్టి నన్ను, సుమంత్ కుటుంబాన్ని వేధించారని విమర్శించారు. సుమంత్‌పై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీపై నేను ఎలాంటి విమర్శలు చేయలేదు. ఒకప్పుడు మల్లు రవి కూడా ఒకప్పుడు కాంగ్రెస్‌ను తిట్టారు. మాజీ సీఎం రోశయ్య, జైపాల్‌రెడ్డి కూడా ఇందిరాగాంధీని తిట్టారు. నా కుమార్తె వ్యాఖ్యలకు నాపై చర్యలు తీసుకోవటం బాధాకరం. రూ.50 కోట్లు ఇచ్చి పీసీసీ పదవి తెచ్చుకున్నారని తిట్టినవారికి పదువులు ఇచ్చారు. నన్ను తొలగించినందుకు ఏమీ బాధపడటం లేదు. కారణం చెప్పకుండా తొలగించడమే చాలా బాధాకరం. బీసీ మహిళను ఇలా అవమానకరంగా తొలగించటం బాధాకరం. కారణం చెప్పకుండా తొలగించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. కారణం చెప్పాల్సిన బాధ్యత సీఎం, ఏఐసీసీపై ఉందని అన్నారు. మంత్రిగా తనకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని, తన ప్రమేయం లేకుండానే తన శాఖలో నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. తనకు తెలియకుండా తన ఓఎస్‌డీ సుమంత్‌ను తప్పించారని, అభివృద్ధి విషయంలో తన నియోజకవర్గంపై వివక్ష చూపారని విమర్శించారు. తన శాఖలోని అంశాలపై కడియం శ్రీహరి జోక్యం చేసుకున్నారని, తన శాఖలోని అధికారులతో కడియం సమీక్షలు నిర్వహించారని తెలిపారు. మంత్రులందరూ సంతోషంగా ఉన్నారా? గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పాలని సురేఖ కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ సంతోషంగా లేరనే విషయం అందరికీ తెలుసనని తెలిపారు. ఇప్పటికైనా అందరూ బయటికి వచ్చి ధైర్యంగా మాట్లాడాలని సూచించారు. ప్రజలకు సేవ, అభివృద్ధి చేయలేకపోతున్నామనే బాధ అందరిలో ఉందని, పనుల జరగాలంటే ఎవరివద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారని ఆరోపించారు. ఇస్తామన్న హామీలు నెరవేర్చకపోవటం వల్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని స్పష్టం చేశారు. తాను తప్పు చేయలేదని, తనకు పశ్చాత్తాపం లేదని కొండా సురేఖ వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. వైఎస్ఆర్ తర్వాత రేవంత్ రెడ్డినే ఎక్కువ అభిమానించానని, రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు, సీఎం కావాలని తానే ముందు కోరుకున్నానని పేర్కొన్నారు. తనపై కక్షపూరితంగా చర్యలు తీసుకున్నారని భావిస్తున్నానన్న కొండా సురేఖ తన వల్ల ముగ్గురు బీసీ మహిళలకు పదవులు రావటం సంతోషకరమని తెలిపారు. తన కోసం చిన్నారెడ్డిపై వేటు వేయటం సరికాదని అభిప్రాయపడ్డారు. తన కుమార్తె వ్యాఖ్యలను తాను ఖండించాల్సిన అవసరం లేదన్న సురేఖ తన కుమార్తె వ్యక్తిగత అభిప్రాయాన్ని తప్పుపట్టే అధికారం తనకు లేదని స్పష్టం చేశారు. అధిష్ఠానానికి తాను ఇచ్చిన లేఖను మీడియాకు ఇస్తున్నానని, భవిష్యత్ కార్యాచరణపై ఇంకా ఆలోచించుకోలేదని తెలిపారు. జగ్గారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏం నిర్ణయం తీసుకున్నారని ఆమె నిలదీశారు. అధిష్టానం చర్యలకు ముందు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు వివరణాత్మక లేఖ రాశారు. తాజాగా ఆమె ఆ లేఖను బహిర్గతం చేశారు. 2026 ఆగస్టు 23న రాసిన ఈ లేఖలో తాను బీసీ మహిళా మంత్రిగా రాజకీయ అణచివేతకు గురవుతున్నట్లు వివరించారు. వరంగల్ ఈస్ట్ ఎమ్మెల్యేగా, అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రిగా పనిచేస్తున్న ఆమె తనకు 31 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉందని, ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవం ఉందని ప్రస్తావించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తన అధికారాలు క్రమంగా కుదించబడుతున్నాయని ఆమె ఆరోపించారు. తన శాఖలకు సంబంధించిన కీలక నిర్ణయాలు సీఎంఓ నుంచి నేరుగా జారీ అవుతున్నాయన్నారు. తనను సంప్రదించకుండా తీసుకుంటున్నారని పేర్కొన్నారు. యాదాద్రి టెంపుల్ ట్రస్ట్ బోర్డు ఏర్పాటు వంటి ముఖ్యమైన అంశాల్లో తనకు సమాచారం కూడా ఇవ్వలేదని, సమ్మక్క-సారలమ్మ ఆలయ అభివృద్ధి నిధులు ఒక్క రోజులోనే రోడ్లు, భవనాల శాఖకు బదిలీ చేశారని వివరించారు. శ్రీ రామనవమి సందర్భంగా ప్రభుత్వ ప్రకటనల్లో తన ఫోటోను తొలగించడం తన గౌరవాన్ని దెబ్బతీసిందని అన్నారు.

మాజీ ఓఎస్‌డీ సుమంత్‌ను తనకు తెలియకుండా తొలగించి, పోలీసులు మంత్రి నివాసానికి వచ్చి అరెస్టు చేయడానికి ప్రయత్నించారని, ఇప్పుడు అతనిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వరంగల్ ఈస్ట్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఆలస్యం అవుతున్నాయని, స్మార్ట్ సిటీ, మోడల్ బస్ స్టాండ్, బొంది వాగు విస్తరణ వంటి పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదాయ శాఖ అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించినా తనకు సమాచారం ఇవ్వలేదని, అభ్యంతరం తెలిపినా చర్యలు లేవని ఆరోపించారు. జగ్గా రెడ్డి విషయంలో అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని సీఎం చెప్పి, పరకాలలో రేవూరి ప్రకాశ్ రెడ్డికి భారీ మెజారిటీ ఇవ్వాలని బహిరంగంగా పిలుపునివ్వడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. తన 31 సంవత్సరాల కాంగ్రెస్ సేవను దృష్టిలో ఉంచుకుని న్యాయం జరిగేలా విచారణ జరపాలని ఖర్గేను కోరారు. లేఖతో పాటు సంబంధిత వీడియోలు, ఆధారాలు ఉన్న పెన్ డ్రైవ్‌ను కూడా జత చేశారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీపై తన విశ్వాసం చెరగలేదని స్పష్టం చేశారు. ఈ లేఖ ద్వారా అన్ని పరిణామాలను వివరించినా రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ కు అధిష్టానం తలొగ్గింది అని కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారు. తాను అధిష్టానానికి పంపిన లేఖను రిలీజ్ చేశారు. కాగా కేబినెట్ నుంచి బర్తరఫ్ కావటంతో సురేఖ తదుపరి నిర్ణయం పైన ఉత్కంఠ కొనసాగుతోంది. కొండా సురేఖ ఇప్పుడు ఎమ్మెల్యే పదవికి.. పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్దమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు తన మద్దతు దారులతో మంత్రాంగం కొనసాగిస్తున్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాల అవగాహన సదస్సు



శేరిలింగంపల్లి అక్షరం ప్రతినిధి: శేరిలింగంపల్లి వడ్డెర బస్తీ, తాతాజీ నగర్, మసీద్ బండ లో హెడ్ హెల్డ్ హై ఫౌండేషన్ అమెజాన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు నమోదు శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పోస్ట్ ఆఫీస్ పథకాలు, ఆయుష్మాన్ భారత్ కార్డు, ఈ-శ్రమ్ తెలంగాణ లేబర్ కార్డు వంటి వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించారు. అర్హులైన లబ్ధిదారులకు అక్కడికక్కడే దరఖాస్తు నమోదు ప్రక్రియలో సహాయం అందించి, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందేందుకు అవసరమైన మార్గదర్శకత్వం అందించారు. ప్రత్యేకంగా తెలంగాణ లేబర్ కార్డు నమోదు ప్రక్రియను నిర్వహిస్తూ, అసంఘటిత రంగ కార్మికులకు అందుబాటులో ఉన్న బీమా, విద్య, వైద్యం మరియు ఇతర సంక్షేమ ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు వరికుప్పల సహదేవ్ కె. రాజు, సురేష్, లక్ష్మణ్, వెంకటేష్, సంజీవ్, గ్రామ సభ్యులు స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొని ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించి, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.ల

## కార్మికులకు అండగా తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం

- **టి.ఆర్.వి.కె.ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్.**



మంచిర్యాల జిల్లా/ మందమర్రి, సెప్టెంబర్ 3 /అక్షరం న్యూస్ –:

కార్మికులకు నిరంతరం అండగా ఉంటూ వారి హక్కుల కోసం పోరాటం చేస్తున్న సంఘం తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టి.ఆర్.వి.కె.ఎస్) అని రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ అన్నారు. గురువారం మంచిర్యాలలోని ప్రాంతీయ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మికుల సంక్షేమం హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్నామని ప్రభుత్వం యాజమాన్యంతోను చర్చలు జరుపుతూ కార్మికులకు రావాల్సిన హక్కులను సంక్షేమ ఫలాలను పదోన్నతులను సాధించేందుకు టి.ఆర్.వి.కె.ఎస్ కృషి చేస్తున్నదని అన్నారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి సమస్యను తమ సమస్యల భావించి అవసరమైన సందర్భంలో చర్చల ద్వారా లేదా పోరాటం ద్వారా ముందుకు సాగుతున్నామన్నారు. మంచిర్యాల ప్రాంతంలో కార్మికులు సంఘటితంగా ఉండి సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరు భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 327 యూనియన్ నుంచి దాదాపు 20 మంది టి.ఆర్.వి.కె.ఎస్ లో చేరగా వారిని సంఘములోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం వ్యవస్థాపకుడు, గౌరవ అధ్యక్షుడు కోడూరు ప్రకాష్ గౌడ్, రాష్ట్ర అదనపు కార్యదర్శి పూదరి గోపాల్ రావు, టిజి ఎన్పిడిసిఎల్ కంపెనీ అధ్యక్షుడు ఎండి అజీజ్, కంపెనీ కార్యదర్శి బండారి ప్రభాకర్, మంచిర్యాల జిల్లా గౌరవ అధ్యక్షులు కొంక శ్రీనివాస్, కంపెనీ వైస్ ప్రెసిడెంట్ అశోక్ రావు, కంపెనీ అసిస్టెంట్ సెక్రటరీ చంద్రగిరి లక్ష్మణ్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కే. శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ముస్కే నరసయ్య, మంచిర్యాల జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు సి.హెచ్ విజయానంద్, జిల్లా కోశాధికారి సుధాకర్, మంచిర్యాల డివిజన్ అధ్యక్షులు దామోదర్ రాజ్, జిల్లా సెక్రెటరీ వినోద్, మంచిర్యాల డివిజన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్, కోశాధికారి కృష్ణ, బెల్లంపల్లి డివిజన్ అధ్యక్షుడు తిరుపతి, కార్యదర్శి తిరుపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, కోశాధికారి అనిల్ ఇతర జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

## 8వ బెటాలియన్ టీజీఎస్పీ కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి ని కలిసిన కాంగ్రెస్ నేత షేక్ చాంద్ పాషా




శేరిలింగంపల్లి అక్షరం ప్రతినిధి: శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ చాంద్ పాషా 8వ బెటాలియన్ టీజీఎస్పీ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కమాండెంట్‌తో పాటు అసిస్టెంట్ కమాండెంట్లు బి. సత్యనారాయణ, సునీల్, ఎస్. రాంబాబు, ఆర్ఐ పూర్ణచంద్రరావు, ఎస్ఐ సత్యనారాయణ, మహేందర్ రెడ్డి తదితరులను చాంద్ పాషా కలిశారు. ఈ సందర్భంగా బెటాలియన్‌కు సంబంధించిన పలు అంశాలపై అధికారులతో ఆత్మీయంగా మాట్లాడారు. కమాండెంట్ డి.శివ ప్రసాద్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేసి, వారి సేవలు విజయవంతంగా కొనసాగాలని షేక్ చాంద్ పాషా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, ప్రసాద్ గుప్తా, యూ

# ఎంపీపీఎస్ సిద్ధిక్ నగర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు





శేరిలింగంపల్లి అక్షరం ప్రతినిధి: అంజయ్య నగర్ డివిజన్ ఎంపీపీఎస్ సిద్ధిక్ నగర్ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో అలరించారు. చిన్నారులు శ్రీకృష్ణుని జీవిత విశేషాలు, భగవద్గీత సందేశం పండుగ ప్రాముఖ్యతను తెలియజేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పాటలు, నృత్యాలు వివిధ కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. బాలమణి మాట్లాడుతూ, శ్రీకృష్ణుడి బోధనలు విద్యార్థులకు సత్యం, ధర్మం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను నేర్పుతాయని తెలిపారు. వేడుకల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభను ఉపాధ్యాయులు అభినందించారు.

# అలరించిన ఆట పాట పల్లె జానపదాలు

- **డి.డి యాదగిరి ఛానల్ ఆట పాట సీజన్ 4 కు ఆడిషన్స్.**

మంచిర్యాల జిల్లా/ మందమర్రి, సెప్టెంబర్ 3/ అక్షరం న్యూస్ –:

దూరదర్శన్ యాదగిరి టీవీ ఛానల్ ఆధ్వర్యంలో ఆట పాట సీజన్ 4 పల్లె జానపదాల ఆడిషన్స్ ను శాంకరి గార్డెన్స్ లో నిర్వహించారు. ఈ అడిషన్ లొ మంచిర్యాల జిల్లాకు చెందిన గాయని, గాయకులు దాదాపు 30మంది పాల్గొన్నారు. పల్లె మట్టి వాసనల నుంచి పుట్టిన జానపదాలను వెలికి తీసి ఎందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కళాకారులను ప్రోత్సహించేందుకు డిడి యాదగిరి ఛానల్ ద్వారా ఆటపాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సీజన్ 4 ఆడిషన్స్ ను మంచిర్యాల జిల్లా కళాకారుల కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి కళాకారుడు పల్లె జానపదాలు వారి వారి శైలిలో ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అసలు సిసలైన జానపదాలను పల్లె నుండి సేకరించి పాడిన పాటలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. పల్లె పదాలను






ప్రపంచానికి

ప రి చ య ం

చేయాలని సంకల్పంతో కళాకారులు ఉన్న ప్రాంతంలోనే ఆడిషన్స్ నిర్వహిస్తున్నట్లు సెలెక్ట్ కమిటీ సభ్యులు ఉప్పులేటి నరేష్, గడ్డం రమేష్ లు తెలిపారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా సీనియర్ కళాకారిణి బండ శాంకరి వ్యవహరించగా యాంకర్ గా నాగలక్ష్మి ఆద్యంతం ఆనక్తికరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాకారులు పాడిన పాటలకు సంగీత సహకారాన్ని డోలక్ హరీష్, డప్పును స్వామి లు అందించగా డిడి యాదగిరి ఛానల్ అధికారులు కెమెరా యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

## అల్పాహార పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



హనుమకొండ/ధర్మసాగర్ /సెప్టెంబర్ 3/అక్షరం న్యూస్:

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పోషకవిలువలతో కూడిన అల్పాహారాన్ని అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ముఖ్యమంత్రి బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ధర్మసాగర్ మండలం కాషాగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉదయం పాఠశాలకు వచ్చిన తర్వాత ఆకలితో ఉండకుండా, ఆరోగ్యంగా ఉండడంతో పాటు చదువుపై ఏకాగ్రత పెంచాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. వారంలో ఒక్కో రోజు బోండా, పూరీ, ఉప్మా, ఇడ్లీ, వడ తదితర రకాల అల్పాహారం అందించనున్నట్లు చెప్పారు. దేశంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు.కాషాగూడెం ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం సుమారు 92 మంది విద్యార్థులు ఉన్నారని, గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు పాఠశాలను అప్పర్ ప్రైమరీగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు. అదనపు తరగతి గదులు, ఉపాధ్యాయులు, ఇంగ్లీష్ మీడియం విద్యకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామంలో రూ.11 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించామని, రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ఇప్పటికే ఏడు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, గ్రామపంచాయతీ భవనం, మరిన్ని సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆకలితో ఉండకుండా పోషకాహారం అందించడమే అల్పాహార పథకం ఉద్దేశమన్నారు. హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిరోజూ తాజా ఆహారాన్ని వివిధ రకాల మెనూతో అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో రూ.12 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి ఎమ్మెల్యే, కలెక్టర్ శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సయ్యద్ సత్తార్, డీఈవో గిరిరాజ్ గౌడ్, తహసిల్దార్ బావ్‌సింగ్, ఎంపీడీవో అనిల్‌కుమార్, ఎంఈవో శ్రీదేవి, ప్రధానోపాధ్యాయురాలు యాస్మిన్ జహాన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## కొండా సురేఖ 'సెల్ఫ్ గోల్'




రాజకీయాల్లో అనుభవానికి దక్కే గౌరవానికి ఒక ప్రాధాన్యం ఉంటుంది. సీనియర్ నేతగా ఆమెకున్న రాజకీయ అనుభవాన్ని, సుదీర్ఘ ప్రస్థానాన్ని గౌరవిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆమెకు మంత్రి పదవి ఇచ్చి తగిన ప్రాధాన్యం కల్పించింది. కానీ, కొండా సురేఖ మాత్రం ఆ గౌరవాన్ని నిలుపుకోవడంలో ఘోరంగా విఫలమయ్యారు. ఏ పార్టీ అయితే తనను నమ్మి బాధ్యతలు అప్పగించిందో, అదే పార్టీకి నిరంతరం తలనొప్పిగా మారుతూ, ప్రభుత్వ ప్రతిష్టను మసకబారేలా చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ ఏం మాట్లాడుతున్నారో, దాని పరిణామాలు ఎక్కడికి దారితీస్తాయో కూడా ఆలోచించకుండా ప్రవర్తించిన తీరు పార్టీ ప్రయోజనం కోసం ఏమాత్రం క్షమించరానిది. ఇది ఖచ్చితంగా తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కున్న చందంగా మారింది.సినిమా రంగానికి చెందిన ప్రముఖుల వ్యక్తిగత జీవితాలపై చేసిన దారుణ వ్యాఖ్యలతో మొదలైన వివాదం, చివరికి ఆమె రాజకీయ భవిష్యత్తునే దెబ్బతీసింది. ముఖ్యంగా, వెనుక నుండి కూతురు ద్వారా మాట్లాడించడం. ఏకంగా ముఖ్యమంత్రి నే అగౌరవ పరుస్తూ టార్గెట్ చేయడం సామాన్య జనానికి సైతం రుచించలేదు. కొండా దంపతులు ఆడిన రాజకీయ చదరంగంలో ఘోరంగా దెబ్బతిన్నారు. అధిష్టానాన్ని ఇరకాటంలో పెట్టడానికి, పార్టీపై పైచేయి సాధించడానికి ఆడిన పన్నుగడలు అన్నీ వికటించాయి. అటు ప్రజాక్షేత్రంలోనూ, ఇటు పార్టీలోనూ తీవ్ర వ్యతిరేకత తెచ్చిపెట్టాయి. సీనియర్ నాయకురాలై ఉండి కూడా, రాజకీయాల ఉచ్చులో ఇంతటి దారుణమైన ఉద్వాసనకు గురవుతారని, ఈ స్థాయిలో రాజకీయ పతనం చూస్తారని ఎవరూ ఊహించలేదు.?చివరకు ఊహించిన పరిణామమే జరిగింది. ఏఐసీసీ, రాష్ట్ర ప్రభుత్వం ఇక సహించేది లేదని తేల్చిచెప్తూ ఆమెను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారు. ఒక రకంగా చెప్పాలంటే ఇది వేరొకరు చేసిన దాడి కాదు, ఆమె స్వయంగా చేసుకున్న "సెల్ఫ్ గోల్". విచక్షణ మరచి, ఆవేశంతో మాట్లాడిన ప్రతి మాట, నడిపిన ప్రతి వ్యూహం ఆమె పదవినీ, రాజకీయ భవిష్యత్తునూ తుడిచిపెట్టేసింది. సీనియారిటీ అనేది గౌరవాన్ని తేవాలి కానీ, అహంకారానికి, అసంబద్ధ రాజకీయ వ్యూహాలకు లైసెన్స్ కాదని ఈ బర్తరఫ్ నిర్ణయం ఓ హెచ్చరికగా నిలిచింది. అధికారం ఇచ్చిన బాధ్యతను పక్కనపెట్టి ప్రవర్తిస్తే ఎంతటి సీనియర్ నాయకులైనా రాజకీయం నుంచి ఎలా తప్పుకోవాల్సి వస్తుందో అనడానికి కొండా సురేఖ ఉద్వాసన సంఘటనే ప్రత్యక్ష నిదర్శనం.

(మహమ్మద్ యూసుఫ్ అలీ)

## సర్పంచ్ యునుస్ పటేల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫారాలు అందజేత



మద్నూర్ / సెప్టెంబర్ 03 (అక్షరం న్యూస్ - కామారెడ్డి):
డోంగ్లీ మండలం ఎనబురా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ యునుస్ పటేల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నూతన యూనిఫారాలను అందజేశారు.విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఏకరూప దుస్తులను సకాలంలో అందించడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. తెలుగు మీడియం, ఉర్దూ మీడియం విద్యార్థులకు ఏక రూప దుస్తులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ యునుస్ పటేల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించడంతో పాటు, అవసరమైన వసతులను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ యునుస్ పటేల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎఫ్‌సీఎల్‌లో కార్పొరేట్ పాఠశాల వద్దు.. నవోదయ విద్యాలయం ముద్దు




జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 3 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఆర్ఎఫ్‌సీఎల్‌లో శ్రీ చైతన్య పాఠశాలను తొలగించి, జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అంబేద్కర్ సర్కిల్‌లో 'శ్రీ చైతన్య హైస్కూల్ వద్దు.. జవహర్ నవోదయ విద్యాలయం ముద్దు' అనే నినాదంతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ప్రీతం మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాకు ఒక జవహర్ నవోదయ విద్యాలయం కేటాయిస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో నవోదయ విద్యాలయం ఏర్పాటుకు అనువైన ప్రాంగణం ఉన్నందున, విద్యా వ్యాపారం చేసే పాఠశాలను తొలగించి పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉండే నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.ఎన్టీపీసీలోని పాఠశాలకు యాజమాన్యం సౌకర్యాలు కల్పిస్తూ, పదో తరగతి విద్యార్థుల నుంచి ఎన్టీపీసీ విద్యార్థులకు రూ.25,263, ఇతర విద్యార్థులకు రూ.38,340 ఫీజు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లోని శ్రీ చైతన్య పాఠశాలకు సౌకర్యాలు కల్పిస్తున్న యాజమాన్యం, అధిక ఫీజుల వసూళ్లపై స్పందించకపోవడం సరికాదన్నారు. పదో తరగతి విద్యార్థుల నుంచి సెంట్రల్ టెక్నో విద్యార్థులకు రూ.70,800, సెంట్రల్ టెక్నో ఆర్ఎఫ్‌సీఎల్ విద్యార్థులకు రూ.51,300 వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.కార్పొరేట్ పాఠశాలకు బదులుగా నవోదయ విద్యాలయం ఏర్పాటు చేసి స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నవోదయ విద్యాలయం ఏర్పాటయ్యే వరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు, ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు తడిగొప్పుల అనూప్ సాయి, గొడిసెల ప్రణీత్, అభిషేక్, శ్రావణ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిడికె ఓసి-5 గని సరికొత్త రికార్డు

- **ఒకే రోజు 13,024 టన్నుల బొగ్గు రవాణా**

జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 3 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: రామగుండం ప్రాంతం-1 పరిధిలోని జిడికె ఓసి-5 గని బొగ్గు రవాణాలో సరికొత్త రికార్డు సృష్టించింది. బుధవారం 2వ తేదీన 8,907 టన్నుల లక్ష్యానికి గాను 13,024 టన్నుల బొగ్గును రవాణా చేసి 146 శాతం లక్ష్యాన్ని సాధించింది.ఈ ఘనత సాధించిన పర్యవేక్షకులు, కార్మికులు, కాంట్రాక్టు సిబ్బంది, యూనియన్ నాయకులు, అధికారులను ఆర్జీ-1 ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో అన్ని గనులు పనిచేసి వార్షిక లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు.

# రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారుల సందడి..






సూర్యాపేట /నేరేడుచర్ల, సెప్టెంబర్ 3:అక్షరం న్యూస్
నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని చింతబండ నేరేడుచర్ల--4 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఏఎల్ఎంఎస్‌సీ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా చిన్నారులు, తల్లులతో కలిసి వేడుకలను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 14వ వార్డు కౌన్సిలర్ సరికొప్పుల విజయలక్ష్మి--నాగేశ్వరరావు హాజరై చిన్నారులు, తల్లులకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి, సంరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారి సర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.అంగన్‌వాడీ టీచర్ గుడిపాటి జయమ్మ, ఏఎల్ఎంఎస్‌సీ కమిటీ సభ్యులు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా చిన్నారులు కృష్ణుడు, రాధ తదితర వేషధారణలతో సందడి చేయడంతో వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# పరిశుభ్రతపై విద్యార్థుల కలానికి పదును...





సూర్యాపేట /నేరేడుచర్ల, సెప్టెంబర్ 3:అక్షరం న్యూస్
నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం 'క్లీన్ ఇండియా--స్వచ్ఛ భారత్' అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.పరిశుభ్రత, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం తదితర అంశాలపై విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యాసాల రూపంలో వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా పరిశుభ్రత ప్రాధాన్యతను వివరిస్తూ.. 'పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత' అనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వనపర్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పరిశుభ్రత, సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించారు.కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటరమణ, సునీత, నరసింహాచారి, గణేశ్, వీరేష్ పాల్గొన్నారు.

# ప్రగతి విద్యాలయంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు






సూర్యాపేట /నేరేడుచర్ల, సెప్టెంబర్ 3: అక్షరం న్యూస్
నేరేడుచర్లలోని ప్రగతి విద్యాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు రాధాకృష్ణుల వేషధారణలో సందడి చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు.కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా విద్యాలయ ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు ఉట్టి కొట్టేందుకు పోటీపడి ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమం సందడిగా సాగింది. విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొని ఆనందంగా గడిపారు.ఈ కార్యక్రమాన్ని విద్యాలయ కరస్పాండెంట్, ప్రిన్సిపల్ కొప్పుల రంగారెడ్డి, కొప్పుల భాస్కర్ రెడ్డి ప్రారంభించారు. అధ్యాపక బృందం ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ మాట్లాడుతూ కృష్ణాష్టమి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఉత్సాహపరిచారు.

# అల్పాహార పథకాన్ని ప్రారంభించిన సర్పంచ్ మాచర్ల జ్యోతి





హనుమకొండ/ధర్మసాగర్/సెప్టెంబర్ 3/అక్షరం న్యూస్
ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకాహారం అందించడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహార పథకాన్ని ధర్మసాగర్ గ్రామంలో సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. గురువారం రోజున గ్రామంలోని పాఠశాలలో అల్పాహార పథకాన్ని గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా, వార్డ్ మెంబర్లు తో కలిసి పథకాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాచర్ల జ్యోతి మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహార భోజన పథకం పేద, మధ్యతరగతి పిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో హాజరు శాతం పెంచడంతోపాటు పిల్లలకు పౌష్టికా ఆహారం అందించడానికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వార్డుమెంబర్లు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

# రైతుల జీవితాలను మార్చేందుకే సాంకేతికను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలి





- **'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'తో విత్తనోత్పత్తిలో నూతన శకం**
- **అడ్వాంట గ్లోబల్ సీఈవో భూపేన్ వి దుబే**

జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) సెప్టెంబర్ 03: నాణ్యమైన విత్తనోత్పత్తి, ఆధునిక యాంత్రీకరణతోనే రైతులకు అధిక దిగుబడి,ఆర్థిక భరోసా సాధ్యమవుతుందని వ్యవసాయ రంగ నిపుణులు స్పష్టం చేశారు. అధునాతన సాంకేతికతను జోడించి విత్తన రంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, భవిష్యత్ కార్యాచరణ ప్రయోజనాలపై పలు అంశాలను అడ్వాంట గ్లోబల్ సీఈవో భూపేన్ వి దూబే,ఆసియా, ఆఫ్రికా ప్రాంతీయ ప్రతినిధి బెళగంవార్, గ్లోబల్ చీఫ్ సప్లై ఆఫీసర్ చెరుకు రమేష్ లు వివరించారు. రఘునాథపల్లి మండలంలో ని బానాజీపేట గ్రామ శివారులోని అడ్వాంట కంపెనీలో జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు అనేక అంశాలపై కూలంకషంగా వివరించారు.

30 ఏళ్ల క్రితమే కరీంనగర్‌లో తొలి అడుగు పడిందని,

గతంలో సరైన షెల్లర్లు లేక పంట కోత అనంతరం విత్తనాలు విరిగిపోయి నాణ్యత, మొలకశాతం దెబ్బతినేదని గుర్తుచేశారు. ఈ సమస్యను అధిగమించేందుకు 30 ఏళ్ల క్రితమే సుమారు రూ.50 లక్షల పెట్టుబడితో కరీంనగర్‌లో 'సూ60' అధునాతన షెల్లర్ మెషిన్‌ను ప్రవేశపెట్టారు. ఆ తర్వాత ఆరుబయట కళ్ళాల్లో ఆరబెట్టిన విత్తనాలు అకాల వర్షాలకు కొట్టుకుపోవడంతో, నెడిపల్లి గ్రామంలో మొదటిసారిగా ఆధునిక డ్రైయర్లను అందుబాటులోకి తెచ్చారు. కేవలం 2 ఎకరాలతో ప్రారంభమైన ఈ ప్రస్థానం, ప్రస్తుతం 8,000 మెట్రిక్ టన్నుల స్థాయికి చేరిందని, వైఫల్యాల రేటును 2 శాతం కంటే తక్కువకు పరిమితం చేశామని పేర్కొన్నారు.

'యునిమార్ట్' ద్వారా సాంకేతిక పరికరాలు -- పెట్టుబడులకు ఆహ్వానం

రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గించి, అంతర్జాతీయ స్థాయి నాణ్యతను అందించడమే లక్ష్యంగా 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ సీడ్ ప్రొడక్షన్' కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి మరో 6 కేంద్రాలను ప్రారంభించనున్నారు. 'యునిమార్ట్' ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వ్యవసాయ యంత్రాలపై పెట్టుబడి పెట్టవచ్చని, ఆ మెషిన్లను యునిమార్ట్ ద్వార రైతులకు అందుబాటులో ఉంచి, పెట్టుబడిదారులకు నికర లాభాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఖమ్మం లాంటి ప్రాంతాల్లో ఒక్క హార్వెస్టింగ్ పనులకే ఎకరాకు రూ.15,000 వరకు ఖర్చవుతోందని, చిన్న తరహా యంత్రాలు, డీ-హస్కింగ్ మెషిన్ల ద్వారా ఈ భారాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.

డిజిటల్ పర్యవేక్షణ, వాతావరణ అంచనాలతో నష్ట నివారణ

తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే కొత్త సీడ్ యాక్ట్ తీసుకొచ్చి దళారీ వ్యవస్థను రూపుమాపేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, ఈ కేంద్రాలు రైతులకు మరింత రక్షణగా నిలుస్తాయని వెల్లడించారు. 'ఈగిల్ ఐ' పర్యవేక్షణ, 'క్రాప్ పల్స్' యాప్ మరియు బెంగళూరులోని 200 మంది ఐటీ నిపుణుల బృందం ద్వారా ఫీల్డ్ మ్యాపింగ్, పంట డేటాను పక్కాగా నిర్వహిస్తున్నారు.

అంతర్జాతీయ వాతావరణ సంస్థ సహకారంతో 90 శాతం కచ్చితత్వంతో కూడిన ముందస్తు సమాచారాన్ని ఉపయోగించి, నిజామాబాద్ జిల్లాలో సుమారు 600 ఎకరాల్లో జరగాల్సిన విత్తనోత్పత్తి నష్టాన్ని కాపాడగలిగారు. గతేడాది 60,000 ఎకరాల్లో ఆధునిక సాంకేతికతను అమలు చేసి దిగుబడిని 20 శాతం మేర పెంచామని, నేడు ఆసియా-పసిఫిక్ రీజియన్‌లోనే 50,000 మెట్రిక్ టన్నులకు పైగా నాణ్యమైన విత్తనాన్ని సరఫరా చేస్తూ అగ్రగామిగా నిలిచామని వివరించారు.

రైతులకు నిత్య ఆదాయం రావాలి: కూరగాయల సాగుపై పిలుపు

ఒకే పంటపై ఆధారపడి నష్టపోకుండా, కనీసం ఐదు గుంటల విస్తీర్ణంలో కొత్తిమీర, కరివేపాకు వంటి ఆకుకూరలు, కూరగాయలు పండించాలని రైతులకు సూచించారు. దీని ద్వారా రోజువారీ కూలీల ఖర్చులకు తగిన ఆదాయం సమకూరుతుందని, ఆంకాపూర్ రైతుల తరహాలో వ్యవసాయాన్ని ఒక ప్రొఫెషనల్ వ్యాపారంగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. నాణ్యమైన విత్తనమే వ్యవసాయానికి తొలి పునాది అని, రైతుల జీవితాలను మార్చేందుకు సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుపిఎల్ సీఈవో చెరుకు రవిశంకర్, యుపిఎల్ యూనిట్ జాతీయ ప్రతినిధి తుశర్ త్రివేది, భారతి గ్రూప్ ఇండస్ట్రీ చైర్మన్ బొత్స బ్రహ్మానంద రెడ్డి, యూని మార్ట్ అడ్వాంట ప్రతినిధులు, బంజిపేట గ్రామ సర్పంచ్ గైని శ్రీనివాస్, కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్, మాజీ మండల రైతు కోఆర్డినేటర్ గొరిగి రవి, గ్రామ వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో రైతులు, పాల్గొన్నారు.

# కృష్ణవేణి పాఠశాలల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 3 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్: కృష్ణవేణి పాఠశాలల గోదావరిఖని, ఎన్టీపీసీ శాఖల్లో కృష్ణాష్టమి వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధా, గోపికల వేషధారణలో అలరించారు.శ్రీకృష్ణుడి బాల్యలీలలు, గోపికలతో ఆటలు, గోవర్ధనగిరి ఘట్టం తదితర సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉట్టి కొట్టే కార్యక్రమం, భక్తిగీతాలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడమే కార్యక్రమాల ఉద్దేశమని తెలిపారు. శ్రీకృష్ణుని బోధనలు, ధర్మం, కర్తవ్యనిష్ఠ, సత్యం, ప్రేమ, ఐక్యత వంటి విలువలను జీవితంలో ఆచరించాలని సూచించారు.వేడుకల్లో పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కరస్పాండెంట్ మంజుల శ్రీనివాస్ రెడ్డి, అకడమిక్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, ప్రిన్సిపాల్స్ రాజిరెడ్డి, సత్యనారాయణ, శైలజ, సిరాజ్ బేగ్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




# విద్యార్థులు ఆటల్లో రాణించాలి

- **ఎం.ఈ.ఓ ఆరేపల్లి రాజయ్య.**



పెద్దపల్లి జిల్లా/ సుల్తానాబాద్ / సెప్టెంబర్ 3/ అక్షరం న్యూస్.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని సుల్తానాబాద్ మండల ఎంఈఓ ఆరేపల్లి రాజయ్య అన్నారు. క్రీడలే ఆరోగ్యానికి బాట అని పేర్కొన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో మూడు రోజులుగా నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు గురువారం ముగిశాయి.ముగింపు కార్యక్రమానికి ఎంఈఓ ఆరేపల్లి రాజయ్య, పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్, ఇండియన్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఎస్‌జీఎఫ్ పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్ మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలనతో సాధన చేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. అనంతరం వివిధ క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు, పతకాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మండల ఎస్.జీ.ఎఫ్ కార్యదర్శి తాండ్ర ప్రణయ్, ఆల్ఫోర్స్ ప్రిన్సిపల్ సత్యం, సీనియర్ ఖోఖో క్రీడాకారుడు బైరగోని రవీందర్, ఖేల్ ఇండియా కోచ్ గెల్లు మధుకర్, టగ్ ఆఫ్ వార్ జిల్లా కార్యదర్శి సంపత్, వ్యాయామ ఉపాధ్యాయులు దాసరి ప్రసాద్, వెంకటేష్, ఆసియా, శ్రీవాణి, సంధ్య, సత్యనారాయణ, శివ, సతీష్, జ్యోతి, రాజేష్, వెంకటలక్ష్మి, సునీత తో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి, ఎమ్మెల్యే



జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 3 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: గోదావరిఖనిలో ఇటీవల మృతి చెందిన బాలదాని రాజయ్య, ఏకశిల వీరస్వామి కుటుంబాలను బుధవారం సాయంత్రం రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పరామర్శించారు.ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులను కలిసి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.



# మాధన్ హిపర్గ గ్రామ పంచాయతీ ఆవరణలో వైద్య శిబిరం నిర్వహణ





మద్నూర్ / సెప్టెంబర్ 03 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి )

డోంగ్లీ మండలం మాధన్ హిపర్గ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని సర్పంచ్ బాచ వార్ లక్ష్మణ్ పటేల్ తెలిపారు. గురువారం రోజున గ్రామ పంచాయతీ ఆవరణలో వైద్య బృందం సభ్యులు గ్రామస్థులకు వైద్య సేవాలు అందించడం జరిగింది. డాక్టర్ లక్ష్మీకాంత్ గ్రామస్థులకు వైద్య సేవాలు అందించి వారికి ట్యాబ్లేట్లు, మందులు అందించడం జరిగింది. సర్పంచ్ కూడా వైద్య శిబిరంలో వైద్యం చేస్కోవడం జరిగింది. సర్పంచ్ లక్ష్మణ్ బాచ వార్ మాట్లాడుతూ గ్రామ ప్రజల యొక్క మెరుగైన వైద్యం కొరకు, వృద్దులకు, మహిళలకు, విద్యార్థులకు వైద్య చికిత్సలు కలగాలని ఉద్దేశం తో పంచాయతీ ఆవరణలో వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని తెలిపారు. వైద్య శిబిరంలో గ్రామస్థులు, మహిళలు, వృద్దులు చికిత్సలు నిర్వహించుకోవడం జరిగింది. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించడం తో గ్రామస్థులు సర్పంచ్ కు ప్రత్యక ధన్యవాదములు తెలిపారు. వైద్య శిబిరం నిర్వహణ కొరకు వచ్చిన వైద్య బృందం సభ్యులకు పంచాయతీ పాలక వర్గం శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్, ఉప సర్పంచ్ పంచాయతీ సెక్రెటరీ పవన్, వార్డు మెంబర్లు, గ్రామస్థులు, వైద్య బృందం సభ్యులు డాక్టర్ లక్ష్మీకాంత్,, శివయ్య (హెల్త్ అసిస్టెంట్), హేమలత ( పి. హెచ్. యం ), శోభ ( నర్సు ), ప్రమీల ( ఆశ వర్కర్ ) తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికి బీమా రక్షణ అవసరం.. ఎల్ఐసి వారోత్సవాలు

జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 3 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:

బీమా ప్రతి కుటుంబానికి ఆర్థిక అండగా నిలుస్తుందని ఎల్ఐసీ రామగుండం శాఖ మేనేజర్ గోపతి మల్లేష్ అన్నారు. ఎల్ఐసీ 70వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న బీమా వారోత్సవాల్లో భాగంగా ఆయన మాట్లాడారు. 1956లో జవహర్‌లాల్ నెహ్రూ చేతుల మీదుగా ఏర్పాటైన ఎల్ఐసీ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థగా దేశ ప్రజలకు బీమా సేవలు అందిస్తోందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రజలకు బీమా సౌకర్యాన్ని కల్పించడం, బీమా అవసరంపై అవగాహన పెంపొందించడం సంస్థ లక్ష్యమన్నారు. అతి తక్కువ ప్రీమియంతో పెద్ద మొత్తంలో ఆర్థిక రక్షణ కల్పించడమే బీమా ఉద్దేశమని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ సంపాదనకు తగిన బీమా కలిగి ఉండాలని, కుటుంబ సంక్షేమం కోసం బీమా చేయించుకోవాలని సూచించారు. ఎక్కువ ప్రీమియం చెల్లించే కొద్దీ పాలసీ ద్వారా లభించే రక్షణ కూడా పెరుగుతుందని వివరించారు. బీమా పాలసీల ద్వారా కుటుంబానికి ఆర్థిక భద్రత లభించడం తోపాటు, గ్రామ పంచాయతీ లకు కూడా పరోక్షంగా సహకారం అందుతుందని మల్లేష్ తెలిపారు. ఎల్ఐసీ ద్వారా గ్రామ పంచాయతీలకు నిధులు అందించే కార్యక్రమాలు ఉన్నాయని, వాటిని గ్రామాభివృద్ధికి వినియోగించుకోవచ్చన్నారు. అతి తక్కువ ప్రీమియంతో లభించే కాలపరిమితి బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పొదుపుతోపాటు వడ్డీ ప్రయోజనం కల్పించే పథకాలు కూడా ఉన్నాయని, భవిష్యత్తు ఆర్థిక అవసరాలకు అనుగుణంగా పాలసీలను ఎంపిక చేసుకోవచ్చన్నారు. గ్రామాలను బీమా గ్రామాలుగా అభివృద్ధి చేయడంపై ప్రజలు దృష్టి సారించాలని కోరారు. బీమా గ్రామాలుగా ఎంపికైన గ్రామాలకు ఎల్ఐసీ ఆర్థిక సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రతి కుటుంబం బీమా సౌకర్యం కలిగి ఉండేలా ప్రజల్లో అవగాహన పెంచడం అందరి బాధ్యత అన్నారు.



## డిజే ఆపరేటర్లకు బైండొవర్ చేసిన ఎస్ ఐ మోహన్ రెడ్డి



మద్నూర్ / సెప్టెంబర్ 03 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి )
మద్నూర్ ఉమ్మడి మండలానికి సంబందించిన డీజే యజమానులకు బైండోవర్ చేయడం జరిగిందని తెలిపారు. రాబోయే గణపతి పండుగకు డీజే ల అనుమతి లేదని తెలిపారు. గణేష్ విగ్రహాల మండపాల యజమానులు పోలీస్ సిబ్బంది చూపించే సలహాలు సూచనలు పాటించి పండుగ ప్రశాంతమైన వాతావరణం లో నిర్వహించుకోవాలని కోరారు. నిషేధం ఉన్నటువంటి డీజే లను ఎవరన్నా పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## న్యూ ఎఫ్ఆర్ఎస్ సిస్టంపై అవగాహన కార్యక్రమం




మద్నూర్ / సెప్టెంబర్ 04 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి )
ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ సెల్ సూచనల మేరకు, కామారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం గారి మార్గదర్శకత్వంలో సెప్టెంబర్ 2న జూమ్ మీటింగ్ ద్వారా న్యూ ఎఫ్ఆర్ఎస్ సిస్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, టీచింగ్ మరియు నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా రిసోర్స్ పర్సన్స్ సయ్యద్ అబ్దుల్ రజాక్ (సీనియర్ అసిస్టెంట్), వజాహత్ అలీ (జూనియర్ లెక్చరర్) నూతన ఎఫ్ఆర్ఎస్ సిస్టం విధానం, వినియోగంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం పాల్గొని విలువైన మార్గదర్శకత్వం అందించారు.

## విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి



మద్నూర్ / సెప్టెంబర్ 03 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి )
మద్నూర్ తహసీల్దార్ ముజీబ్ కు భూమయ్య వినతి పత్రం అందించడం జరిగింది. భూమయ్య వ్యక్తం చేస్తూ వినతి పత్రంలో రాష్ట్రంలోని విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరడం జరిగింది . విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా సుమారు 30 లక్షల మంది విద్యార్థులు విద్యాపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. అనేక మంది విద్యార్థులు తమ కోర్సులు పూర్తి చేసినప్పటికీ, ఫీజు బకాయిల కారణంగా విద్యా సంస్థలు సర్టిఫికెట్లు, ఇతర విద్యా పత్రాలు ఇవ్వడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి అనుముల రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి, సుమారు రూ. 14,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపాలని కోరారు. విద్యార్థుల హక్కుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను త్వరగా విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొనగంటి భూమయ్య , సురేష్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉత్పత్తి కన్నా కార్మికుల భద్రతే ప్రధానం





- **ప్రమాదరహిత సింగరేణి కోసం అన్ని చర్యలు.. రక్షణ పెంపుదలకు ఆధునిక సాంకేతికత వినియోగం**

జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 3 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి కన్నా కార్మికుల భద్రతకే అధిక ప్రాధాన్యత ఇస్తామని, ప్రమాదరహిత సింగరేణి కోసం అన్ని చర్యలు తీసుకుంటామని సంస్థ చైర్మన్, ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. కార్మిక సంఘాలు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకొని భద్రతా చర్యలను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జరిగిన 50వ త్రైపాక్షిక భద్రతా సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు సమర్థవంతంగా అమలవుతున్నాయా, గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతమవుతున్నాయా, ప్రమాదరహిత గనుల నిర్వహణకు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతను ఎలా వినియోగించుకోవాలి అనే అంశాలపై సమగ్రంగా పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని సీఎండీ తెలిపారు. కార్మిక సంఘాల నాయకులు చేసిన సూచనలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో గనుల భద్రతా విభాగం అధికారులు, సింగరేణి అధికారుల సంఘం, గుర్తింపు పొందిన కార్మిక సంఘాలు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల నాయకులు, యాజమాన్య ప్రతినిధులు గనుల్లో భద్రతా చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇటీవలి ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికులకు సమావేశం సంతాపం తెలిపింది. అనంతరం గత ఏడాది త్రైపాక్షిక సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్ష నిర్వహించారు. గనుల భద్రతా సంచాలకుడు డాక్టర్ సగేష్ కుమార్ మాట్లాడుతూ భద్రతపై కార్మిక సంఘాలు చేసిన సూచనలు విలువైనవని, భద్రతా చర్యల విషయంలో సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాలు నిబద్ధతతో పనిచేయడం అభినందనీయమన్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది ప్రాణాపాయ ప్రమాదాలు గణనీయంగా తగ్గడం సంతోషకరమని తెలిపారు. బహిరంగ గనుల్లో సింగరేణి ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికులు కూడా ఒకే చోట వేలిముద్రల ఆధారిత హాజరు నమోదు చేసే విధానాన్ని వెంటనే అమలు చేయాలని సూచించారు. కార్మికుల భద్రతకు అవసరమైన శిక్షణ అందించేందుకు తమ విభాగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని వెల్లడించారు. సమావేశంలో గుర్తింపు పొందిన కార్మిక సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, కార్యదర్శి రాజ్‌కుమార్, ప్రాతినిధ్య కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్, సీనియర్ ఉపాధ్యక్షుడు ఎస్. నరసింహారెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతిగౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి హాజరైన ప్రతినిధులు గనుల్లో భద్రత, ఆరోగ్య, వైద్య సేవల మెరుగుదలకు పలు సూచనలు చేశారు. సిబ్బంది కొరతను తగ్గించాలని, ఆధునిక వైద్య సేవలు అందించాలని, కాంట్రాక్టు కార్మికులకు కూడా తగిన శిక్షణ ఇవ్వాలని, నాణ్యమైన భద్రతా బూట్లు సరఫరా చేయాలని ప్రతినిధులు కోరారు. గనుల్లో అవసరమైన పర్యవేక్షకులు, సిబ్బంది, అధికారులను నియమించాలని, అవసరమైన విడిభాగాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. దీనిపై యాజమాన్యం తరఫున తగిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. సమావేశానికి భద్రతా విభాగం జనరల్ మేనేజర్ సాయిబాబు స్వాగతం పలికారు. సంస్థ డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, ఎం. తిరుమలరావు, జనరల్ మేనేజర్ తాడబోయిన శ్రీనివాస్, అన్ని ప్రాంతాల జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ అధికారులు, గనుల భద్రతా విభాగం అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు పరిపాలనా సేవలు మరింత చేరువ




- **పాలకుర్తిలో నూతన తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం**
- **త్వరలో మండల అభివృద్ధి కార్యాలయం.. రూ.2 కోట్లతో మహిళా భవన్**

జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 3 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: పాలకుర్తి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, భవిష్యత్తులో పారిశ్రామిక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ తెలిపారు. పాలకుర్తి మండలంలో తహసీల్దార్, సంయుక్త సబ్‌రిజిస్ట్రార్, కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. నూతన కార్యాలయం అందుబాటులోకి రావడంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, వేగంగా అందనున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం, అధికారుల సమన్వయంతో నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. పాలకుర్తి మండల ప్రజలకు పరిపాలనా సేవలు మరింత చేరువ చేసేందుకు త్వరలోనే మండల అభివృద్ధి కార్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రాధాన్యమిస్తూ రూ.2 కోట్లతో మహిళా భవన్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పాలకుర్తి మండలంలో మౌలిక వసతులను మెరుగుపరచడంతోపాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తానని రాజ్ ఠాకూర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల ద్వారా మండల అభివృద్ధికి మరింత ఊతం ఇస్తామని అన్నారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం జారీ చేస్తున్న నూతన డిజిటల్ రేషన్ కార్డులను మహిళలకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారి, సహాయ పోలీసు కమిషనర్, సీఐ, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ



మద్నూర్ / సెప్టెంబర్ 03 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి )
డోంగ్లీ మండలం పెద్ద టాక్లి గ్రామంలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఏక రూప దుస్తులు పంపిణీ చేశారు. గురువారం రోజున ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులకు విలాస్ గైక్వాడ్, ఉప సర్పంచ్ జాకిర్ పటేల్ , పాఠశాల హెడ్ మాస్టర్ ఆధ్వర్యంలో లో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. నూతన దుస్తులు రావడం తో విద్యార్థులు, వారి యొక్క తల్లిదండ్రులు సంతోష వ్యక్త పర్చడం జరిగింది. విలాస్ గైక్వాడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కొరకు విద్యార్థులకు ప్రవేటు కంటే దీటుగా విద్య బోధన కలుగే విధంగా దృష్టి సారించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు క్రమ శిక్షణ తో విద్య అభ్యసించి జ్ఞాన వంతులు కావాలని కోరారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను మంచిగా విని ఉజ్వల భవిష్యత్తు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి విలాస్ గైక్వాడ్, ఉప సర్పంచ్ జాకిర్ పటేల్, గ్రామ వార్డు సభ్యులు నాగనాథ్ పటేల్, షాదుల్ సాహబ్, సయ్యద్ జిలాని, దిలీప్ కుమార్, సూర్యకాంత్ తారోటే, ఉపాధ్యాయులు కమర్, బాబు , తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం

జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 3 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : పెద్దపల్లి జిల్లా పరిధిలోని మండలాలకు కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులను నియమించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అనుమతితో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గురువారం నియామకాలను ప్రకటించారు. పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడంతో పాటు, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నూతన అధ్యక్షులు కీలకపాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. నియామకాలు తక్షణం అమల్లోకి వస్తాయని తెలిపారు.మంథని నియోజకవర్గంలో మంథని మండలానికి విల్ ప్రసాద్, ముత్తారం మండలానికి దొడ్డ బాలరాజు, రామగిరికి తుమ్మసారం గౌడ్, కమాన్‌పూర్‌కు సయ్యద్ అన్వర్‌ను నియమించారు.పెద్దపల్లి నియోజకవర్గంలో పెద్దపల్లికి కట్లూరి సుదాకర్ రెడ్డి, ఓదెలకు మూల శ్రీనివాసరెడ్డి, కాల్వ శ్రీరాంపూర్‌కు గజవేన సదయ్య, సుల్తానాబాద్‌కు చిలుక సతీష్, ఎలిగేడుకు సామ రాకేష్‌రెడ్డి, జూలపల్లికి బొజ్జ శ్రీనివాస్, సుల్తానాబాద్ పట్టణానికి వి. అభ్యుదయ గౌడ్, పెద్దపల్లి పట్టణానికి భూతగడ్డ సంపత్‌ను నియమించారు.రామగుండం నియోజకవర్గంలో అంతర్గాం మండలానికి సింగం కిరణ్, పాలకుర్తికి ముక్కెర శ్రీనివాస్‌ను నియమించారు. ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మారం మండలానికి తాళ్లపల్లి రూపేష్ నాయక్‌ను మండల అధ్యక్షుడిగా ప్రకటించారు.

## వైద్యం అందుతుందనుకున్న ఆశలు ఆవిరైపోయాయి.. చికిత్స పొందుతూ నిరుపేద కూలీ గోపాల్ మేస్త్రి మృతి

- ఆసుపత్రి అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి: 1వ డివిజన్ కార్పొరేటర్ మడిపల్లి విజయ మల్లేష్



జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 3 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందుతుందన్న ఆశతో వచ్చిన నిరుపేద కూలీ గోపాల్ మేస్త్రి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందడం తీవ్ర విషాదకరమని 1వ డివిజన్ కార్పొరేటర్ మడిపల్లి విజయ మల్లేష్ ఆవేదన వ్యక్తం చేశారు. పీకే రామయ్య కాలనీకి చెందిన గోపాల్ మేస్త్రి మెరుగైన వైద్యం అందక పరిస్థితి విషమించి కన్నుమూశారని తెలిపారు.ఆపదలో ఉన్న పేదలకు కనీస ప్రాథమిక చికిత్స అందించకుండా వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలిస్తూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. పెద్ద భవనాలు, ఆడంబరాల బోర్డులు ఉన్నప్పటికీ, ఆసుపత్రిలో ప్రాణాలు కాపాడే మందులు, పూర్తిస్థాయి వైద్యులు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఆగస్టు నెలలోనే నలుగురు మృతి చెందగా, తాజాగా గోపాల్ మేస్త్రి మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని, ఆగ్రహాన్ని నింపిందన్నారు.స్థానిక ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చి ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తున్నప్పటికీ, ఇక్కడి అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల పేదల ప్రాణాలు కోల్పోతున్నారని విమర్శించారు. ఆసుపత్రిలో వైద్య సేవలపై జిల్లా కలెక్టర్, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు తక్షణమే సమీక్ష నిర్వహించి, నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందేలా అవసరమైన మందులు, వైద్యులు, అత్యవసర సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

## 6న ఏఐటీయూసీ భారీ బహిరంగ సభ

- కార్మిక వర్గం తరలిరావాలి: కడారి సునీల్




జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 3 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్: ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభల సందర్భంగా సెప్టెంబర్ 6న కరీంనగర్‌లో నిర్వహించే భారీ కార్మిక ప్రదర్శన, బహిరంగ సభకు కార్మిక వర్గం పెద్ద ఎత్తున తరలిరావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగే మహాసభలకు సంబంధించిన గోడపత్రికను బుధవారం ఎన్టీపీసీ నంబర్ టూ గేట్ ముందు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ పోరాటాలకు, ఉద్యమాలకు ఊపిరిగా నిలిచిన కరీంనగర్ గడ్డపై రాష్ట్ర మహాసభలు జరగడం గొప్ప విశేషమన్నారు. సెప్టెంబర్ 6న అంబేద్కర్ స్టేడియం నుంచి సర్కస్ గ్రౌండ్ వరకు భారీ కార్మిక ప్రదర్శన నిర్వహించి, అనంతరం బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. సభలో ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జిత్ కౌర్‌తో పాటు జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని చెప్పారు.మహాసభల్లో గత కార్యక్రమాలపై సమీక్ష, భవిష్యత్ పోరాటాల రూపకల్పనపై చర్చించి, కార్మిక సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు సునీల్ తెలిపారు.గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నాంసాని శంకర్, జిల్లా కోశాధికారి రెడ్డపాక లక్ష్మణ్, రామగుండం నగర అధ్యక్షుడు అబ్దుల్ కరీం, కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్, టి. సత్యనారాయణ, బి. అర్జున్, ఎం. లక్ష్మణ్, ఏ. రాజేందర్ రెడ్డి, కార్తీక్, వెంకటస్వామి, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గణపతి నవరాత్రులు నిమజ్జనం శోభాయాత్ర గురించి అన్ని వర్గాలతో సమావేశం



జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 3 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

గతంలో కంటే మరింత వైభవంగా, ప్రశాంతంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ ,శోభాయాత్ర , నిమజ్జనోత్సవం జరగడానికి ప్రభుత్వ , ప్రభుత్వ రంగ సంస్థలు అన్ని ఏర్పాట్లు చేయాలని రామగుండం శాసన సభ్యులు ఎం ఎస్, రాజ్ ఠాకూర్ అన్నారు. గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచిర్యాల , చెన్నూరు ప్రాంతాల నుండి కూడా పెద్ద సంఖ్యలో గణేష్ విగ్రహాలు గోదావరి బ్రిడ్జ్ వద్దకు నిమజ్జనానికి తరలి వస్తున్నందున ఏర్పాట్లలో ఆయా ప్రాంతాల ప్రభుత్వాధికారులు , సింగరేణి , పోలీస్ అధికారుల సహకారం కూడా తీసుకోవాలని అన్నారు. రామగుండం నగర పరిధిలోని అన్ని విగ్రహాలు ఒకే రోజున నిమజ్జనం చేయాలని అనేక విజ్ఞప్తులువస్తున్నందున తదనుగణంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వెళ్ళేలా దారి ఉంచి మంటపాలు ఏర్పాటు చేయాలని అన్నారు. మండపాల నిర్వాహకులు రోడ్లు తవ్వ వద్దని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. తమ ప్రభుత్వశీ ఎన్ పి డి సి ఎల్ నుండి ఉచిత విధ్యుత్ కనెక్షన్ ఇస్తున్నందున ప్రమాదకరంగా అక్రమంగా తీగలు లైన్లకు తగిలించవద్దని అన్నారు. షార్ట్ సర్క్యూట్ తో ప్రమాదం జరగకుండా ఎం సి బి లు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. మంటలు ఆర్పడానికి బకెట్లలో ఇసుక , డ్రమ్ములలో నీరు మండపాల వద్ద సిద్దంగా ఉంచుకోవాలని అన్నారు. మండపాల వద్ద పరిశుభ్రత పాటించాలని అన్నారు. గణేష్ ఉత్సవాలు , నిమజ్జనాలలో సహాయ సహకారాలు అందించడానికి వలంటీర్ల సేవలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు కూడా రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో పని చేయడానికి తమ సిబ్బందిని పంపించాలని అన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా రోడ్ల మధ్యలో వాహనాలు పెట్టవద్దని నిర్ణీత ప్రదేశాలలో మాత్రమే పార్క్ చేయాలని అన్నారు. ప్రజా ప్రతినిధులు కూడా రాజకీయాలకు అతీతంగా పని చేసి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహిశీచడశీలో తమ వంతు సహకారం అ ం ద ్ జ ే య ్ ా ల ని అన్నారు.రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలైన సింగరేణి , ఎన్ టి పి సి , ఆర్ ఎఫ్ సిఎల్ , జెన్ కో సంస్థలు రామగుండం నగర పాలక సంస్థ సమన్వయంతో గత ఏడాది చేసిన దాని కంటే మరింత మెరుగ్గా ఏర్పాట్లు చేయాలని అన్నారు. విగ్రహాలు సాఫీగా ముందుకు కదలడానికి యుద్ధ ప్రాతిపదికన రోడ్ల గుంతలు పూడ్చాలని అన్నారు . రోడ్డు కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించాలని అన్నారు. నిమజ్జనం రోజున విధ్యుత్ సమస్య రాకుండా ఎన్ పి డి సి ఎల్ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. గోదావరి బ్రిడ్జ్ వద్ద మొబైల్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని అన్నారు. వినాయక చవితి నుండి అన్ని కూడళ్లలో సిరీస్ బల్బులతో అలంకరణ చేయాలని అన్నారు. బి పవర్ హౌజ్ నుండి గోదావరి బ్రిడ్జ్ వరకు సానిటేషన్ నిర్వహణతో పాటు అన్ని లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని హెచ్ కె ఆర్ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు.అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు , ప్రభుత్వ అధికారుల సమన్వయంతో గణేష్ ఉత్సవాల నిర్వహణ , నిమజ్జనోత్సవ ఏర్పాట్లు చేస్తామని అన్నారు. రోడ్లపై గుంతలు పూడ్చడం , ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ , విధ్యుత్ దీపాల ఏర్పాటు , అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా బారికేడింగ్ ,సిసి కెమెరాలు తదితర అన్ని ఏర్పాట్లు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. డి ఎం ఆ హెచ్ ఓ పవిత్ర మాట్లాడుతూ నిమజ్జనం రోజున అంబులెన్స్ లతో పాటు ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఎ సి పి ముడుత రమేష్ మాట్లాడుతూ గత అనుభవాల దృష్ట్యా మరింత అప్రమత్తత తో సేవలందిస్తామని అన్నారు. నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి కావడానికి ఆ రోజు సాధ్యమైనంత త్వరగా విగ్రహాలను తరలించడానికి ఉత్సవ కమిటీ , గణేష్ మండపాల నిర్వాహకులు సహకరించాలని కోరారు. ఎ సి పి ( ట్రాఫిక్ ) శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రాఫిక్ విధుల్లో ఉన్న సిబ్బందికి సహకరించాలని కోరారు. రోడ్ల మధ్యలో వాహనాలు పార్క్ చేస్తే కేసులు నమోదు చేస్తామని అన్నారు.ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , పలువురు కార్పొరేటర్లతో పాటు నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి , ఇ ఇ శాంతి స్వరూప్ , టి పి ఓ నవీన్ తహశీల్దార్ రవీందర్ రావు , సింగరేణి అధికారులు ప్రతాపగిరి రాజు , జితేంద్ర , వర ప్రసాద్ , వీరా రెడ్డి , చంద్ర శేఖర్ , రామ్ రెడ్డి , బాలరాజు ,ఎన్ టి పి సి అధికారులు ప్రవీణ్ , సూర్య నారాయణ , ఆర్ ఎఫ్ సి ఎల్ అధికారులు రాజు , వెంకట రెడ్డి , జెన్ కో అధికారి ఋష్యేంద్రనాథ్ , ఎన్ పి డి సి ఎల్ అధికారులు శ్రీనివాస్ , రమేష్ , మత్స్య శాఖ అధికారి హరీష్ కుమార్ , ఆర్ ఆ బి అధికారి జాఫర్ , సి ఐ లు ఇంద్రసేనా రెడ్డి , ప్రసాద రావు , కృష్ణ కుమార్ , ట్రాఫిక్ సి ఐ రాజేశ్వర్ రావు , మెడికల్ ఆఫీసర్ మాణికేశ్వర్ రెడ్డి హెచ్ కె ఆర్ ప్రతినిధి రాము , వి హెచ్ పి , భజరంగ్ దళ్ , హిందూ వాహిని ప్రతినిధులు , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతోనే నేల తల్లికి రక్షణ



హన్మకొండ జిల్లా/భీమదేవరపల్లి/ సెప్టెంబర్ 03/అక్షరం న్యూస్:-

ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా పెట్టుబడులు తగ్గించుకోవడంతో పాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వ్యవసాయ విస్తరణాధికారి క్రిసోలైట్ సూచించారు. వానాకాలం సీజన్‌ను పురస్కరించుకుని మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో గల రైతు వేదిక నందు రైతులకు ప్రకృతి సాగుపై విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన దేశీ కషాయాలు, ఎరువులైన బీజామృతం జీవామృతం ఘనజీవామృతం నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం, దశపర్ణి కషాయం తయారు చేసే విధానాన్ని రైతులకు వీడియో దృశ్యాల ద్వారా క్షుణ్ణంగా వివరించారు. రసాయన ఎరువులు పురుగుల మందుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి ప్రసాదిత ఎరువులను ఉపయోగించి నాణ్యమైన దిగుబడులు సాధించాలని అధికారులు కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ సీఆర్పీలు గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

## దివాకర్‌రెడ్డి విగ్రహావిష్కరణ.

హన్మకొండ జిల్లా/ భీమదేవరపల్లి/ సెప్టెంబర్ 03/అక్షరం న్యూస్:-



మండలం లోని ముల్కనూర్ గ్రామానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, సామాజిక కార్యకర్త దివంగత దివాకర్‌రెడ్డి విగ్రహాన్ని ముల్కనూర్‌లోని వారి క్రషర్ ప్రాంగణంలో గురువారం కుటుంబ సభ్యులు ఘనంగా ఆ వి ష ్ క రి ం చా ర ు . దివాకర్‌రెడ్డి సతీమణి రుద్రమదేవి, కుమారులు ప్రదీప్‌రెడ్డి, సందీప్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, ప్రముఖులు మాట్లాడుతూ.. దివాకర్‌రెడ్డి సమాజ సేవలో ముందుంటూ ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేసుకున్నారు. మండల రెడ్డి సంఘం గౌరవాధ్యక్షుడిగా సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పరితపించిన ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, బంధుమిత్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నీటి వనరుల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / సెప్టెంబర్ 03 / అక్షరం న్యూస్-:

జిల్లాలోని నీటి వనరులను పరిరక్షిస్తూ వర్షపు నీటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నీటిపారుదల శాఖ పనితీరుపై అధికారులు, ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరుల్లో ఆక్రమణలకు తావులేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. చిన్నతరహా నీటిపారుదల చెరువుల కట్టల పటిష్ఠతను పరిశీలించ డంతో పాటు తూములు సక్రమంగా పనిచేస్తున్నాయో క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలన్నారు. అవసరమైన చోట మరమ్మతు పనులను గుర్తించి, నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. కాలువల్లో పూడిక తొలగించాలి కాలువల్లో పేరుకుపోయిన పూడిక, పిచ్చిమొక్కలను తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. కాలువల భూముల్లో ఆక్రమణలు ఉంటే గుర్తించి తొలగించాలని ఆదేశించారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్న సమయంలో లభించే ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి సాగునీటి అవసరాలకు వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటించాలి నీటి వనరుల నిర్వహణ, కాలువల పరిస్థితి, చెరువుల కట్టలు, తూముల పనితీరును అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు. అధికారులు, ఇంజినీర్లు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి పనుల పురోగతిని, నీటి వనరుల పరిస్థితిని స్వయంగా పరిశీలించాలన్నారు. సమస్యలను గుర్తించిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖఅధికారులు, ఇంజినీర్లు,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నా

## కాంగ్రెస్ పార్టీ రఘునాథపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా కడారి నాగేష్(చిన్న) నియామకం



జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) సెప్టెంబర్03:

మండల సీనియర్ నాయకులు కడారి నాగేష్(చిన్న) కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రకటించారు. మండల కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో నూతన కమిటీ లను ప్రకటించడం జరిగింది. అందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కడారి నాగేష్ (చిన్న) ను మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కడారి నాగేష్(చిన్న) మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు లకావత్ ధనవంతి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రజాప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


## ఇల్లందకుంటలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కరీంనగర్/ఇల్లందకుంట/, సెప్టెంబర్ 03/అక్షరం న్యూస్:

ఇల్లందకుంట గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానము నందు శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి బి. సదయ్య తెలిపారు. ఇందులో భాగంగా తేది: 05-09-2026 శనివారం రోజున ఉదయం 09:30 గంటలకు గ్రామ దేవాలయంలో ఉట్టికొట్టుట, శ్రీ స్వామివార్ల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



## బీఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు



కరీంనగర్/ఇల్లందకుంట/సెప్టెంబర్ 03/అక్షర న్యూస్:. మండలం పరిధిలోని సిరిసేడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు.

కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గొట్టే రాజశేఖర్, సిరిసేడు గ్రామానికి చెందిన ఎస్సీ సెల్ నాయకులు రేనుకుంట్ల జానీ... హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం చేసిన కృషిని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ రోజురోజుకూ బలోపేతం అవుతుందని, రాబోయే రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన గొట్టే రాజశేఖర్, రేనుకుంట్ల జానీ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధి కోసం పని చేస్తామని, పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ వెంకటేష్, సిరిసేడు సర్పంచ్ శ్యామల కుమార్, దామోదర్, మాజీ ఎంపీటీసీ చిన్న రాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు



కరీంనగర్/జమ్మికుంట/సెప్టెంబర్ 03/అక్షరం న్యూస్:

జమ్మికుంట మండలంలోని కోరపల్లి ప్రాథమిక పాఠశాలలో ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు గోపిక శ్రీకృష్ణుని వేషధారణలో కోలాటాలు పట్టుకొని పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ అందరిని విశేషంగా ఆకట్టుకున్నారు. అనంతరం పాఠశాల కార్యక్రమాన్ని నిర్వహించగా విద్యార్థులు పోటీపడి ఉట్టిని కొట్టారు. పుట్టిన కొట్టిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దెబ్బట రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ప్రతి పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించడంతోపాటు ఆ పండుగల యొక్క విశిష్టతలను విద్యార్థులకు తెలిసేలా చేయడం జరుగుతుందని విద్యార్థుల ను తయారు చేసేందుకు సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బలరాం, కుమారి ,రేఖ ,శైలజ తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండ బీజేపీ కార్యాలయంపై దాడిని ఖండిస్తూ జమ్మికుంటలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



కరీంనగర్/జమ్మికుంట/, సెప్టెంబర్ 3/అక్షరం న్యూస్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోద్బలంతో కాంగ్రెస్ నాయకులు నల్గొండ జిల్లా బీజేపీ కార్యాలయంపై దాడి చేసి, దళిత నాయకుడు సంతు రామదాసు చిత్రపటంపై రంగు చల్లడాన్ని నిరసిస్తూ బీజేపీ దళిత మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామంలో బీజేపీ మండలాధ్యక్షులు దొంతరవేనా రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దళిత నాయకుడిని అవమానించడం కాంగ్రెస్ పార్టీకి సరికాదని, దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆకుల రాజేందర్, సంపెల్లి సంపత్ రావు, పుల్లూరు ఈశ్వర్, కేవిడి కుమార్ స్వామి, గరికంటి శ్రీధర్, గాజుల తిరుపతి, భీమిర కిషన్ రావు, గిరవేనా ఐలయ్య, కొట్టాల మల్లేష్, దొంగల రవి, రెంటాల మహేందర్, గుడ్ల రాజకుమార్, శెట్టి హరీష్, రేపెల్లి తిరుపతి, కొట్టాల వెంకటేష్, శంకర్, శివ, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేట మండల కేంద్రంలోని కిడ్జీ ప్రి-స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు



భద్రాద్రి కొత్తగూడెం /అశ్వారావుపేట/ సెప్టెంబర్ 03/ అక్షరం న్యూస్ : అశ్వారావుపేట మండల కేంద్రంలోని కిడ్జీ ప్రి-స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో అలరించారు. బండారు శ్యామ్ - -చందన దంపతుల కుమార్తె బండారు జాన్విక గోపిక వేషధారణలో ప్రత్యేకంగా ఆకట్టుకుంది. పాఠశాల ప్రాంగణాన్ని ఉట్టి, పూలతో అలంకరించారు. చిన్నారులు ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సాంస్కృతిక నృత్యాలు, భక్తి గీతాలతో వేడుకలు సందడిగా సాగాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, చిన్నతనం నుంచే పిల్లలకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను పరిచయం చేయాలనే ఉద్దేశంతో జన్మాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కేరళ పాఠశాలలో ఘనంగా ముందస్తు శ్రీకృష్ణాష్టమి జన్మదినవేడుకలు



కరీంనగర్/ జమ్మికుంట/ సెప్టెంబర్ 03/ అక్షరం న్యూస్:

జమ్మికుంట కేరళపాఠశాలలో శ్రీకృష్ణాష్టమి జన్మాష్టమి వేడుకలను విద్యార్థులు ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల చైర్మన్ కె ఎస్ బెన్ని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు సాంస్కృతి సాహిత్యాల పట్ల సాంస్కృతి పట్ల అవగాహన కల్పించడంలో పాఠశాల యజమాన్యం విద్యార్థులను ప్రోత్సహిస్తున్న తీరుపాట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం మొత్తం పాఠశాల ఆవరణలో ఆహ్లాదకరమైన వాతావరణంలో కొనసాగింది చిన్నారుల వేషాధారణతో అలంకరింప చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఉపాధ్యాయురాలలు పాల్గొన్నారు.

## మండల గౌడ్ సంఘం సమన్వయ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి/ సెప్టెంబర్ 3/ అక్షరం న్యూస్–:

ములకలపల్లి మండల కేంద్రంలో గౌడ్ సంఘం సమన్వయ కన్వీనింగ్ కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక గౌడ కులస్తుల అందరి సమక్షంలో జరిగిన సమావేశంలో నూతన వర్గానికి బాధ్యతలు అప్పగించారు. ఈ కమిటీ కన్వీనర్‌గా నరాటి రమేష్, కో కన్వీనర్‌గా సురబీ రాజేష్‌లను ఎన్నుకున్నారు. సభ్యులుగా ఆనంతుల సత్యనారాయణ, నిమ్మల మధు, బైరు ప్రసాద్, బొల్లగాని నాగేశ్వరరావు, చుక్క వెంకన్న, బైరు సాయి, గాదెబోయిన సతీష్, కాటారపు వెంకట్రావు, బజ్జురి కృష్ణ, పాలగాని చెన్నైకేశవలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులకు మండలంలోని గౌడ్ సంఘం నాయకులు, శ్రేయోభిలాషులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. సంఘం బలోపేతానికి, ఐక్యతకు నూతన కమిటీ మరింత కృషితో పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది :ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, కోరం కనకయ్య



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి /సెప్టెంబర్ 3 /అక్షరం న్యూస్–:

ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఊకె శిరీష అనుమానాస్పద మృతి ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

?ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు చౌటిగూడెం గ్రామానికి చేరుకుని, మృతి చెందిన శిరీష కుటుంబ సభ్యులను నేరుగా పరామర్శించారు. ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకుని, ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున తక్షణ సాయంగా క్రింది భరోసాలను కల్పించారురూ. 5 లక్షల తక్షణ నష్టపరిహారం అందజేత,ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇల్లు మంజూరు,కుటుంబంలో అర్హులైన ఒకరికి ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగం,ఐటీడీఏ సహకారంతో జీవనోపాధి కోసం ప్రభుత్వ వ్యవసాయ భూమి కేటాయింపు,ఈ ఘటనపై ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర దర్యాప్తు జరిపించిందని, వాస్తవాలు నిగ్గుతేల్చి నిందితులను అదుపులోకి తీసుకున్నామని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పార్టీలకతీతంగా అండగా నిలుస్తామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఊకంటి గోపాలరావు, బత్తుల అంజి, ఎండీ జహీరుద్దీన్, తాండ్ర ప్రభాకర్, సీవైసీ అధ్యక్షులు పాలకుర్తి సుమిత్, కుంజా వినోద్, కారం సుధీర్, గాడి తిరుపతి రెడ్డితో పాటు పలువురు మండల నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



## మాత్ర వేసుకున్న తర్వాత శరీరంలో ఏం జరుగుతుందో తెలుసా?

ఏ మాత్రం అనారోగ్యానికి గురైనా, శరీరంలో ఏ భాగం నొప్పికి గురైనా వెంటనే గుటుక్కున మాత్ర మింగేస్తుంటారు. కడుపులో అజీర్తి చేసినా, తలనొప్పిగా అనిపించినా మాత్రవైపు దృష్టి మరలుతుంది. మధుమేహమైనా, బీపీని నియంత్రించాలన్నా.. పూటపూటకీ ఓ మందుబిళ్ల పడాల్సిందే. అయితే.. ఈ ట్యాబ్లెట్లకు శరీరంలో నొప్పెక్కడో, సమస్యేంటో ఎలా తెలుస్తుంది? వేసుకున్న కొన్ని నిమిషాలకే ఆ సమస్య నుంచి ఎలా బయటపడేస్తుంది.? వంటి సందేహాలపై ప్రత్యేక వివరణ మీకోసం...

### మాత్ర పనిచేసే విధానం:

మాత్రను మింగిన వెంటనే అది ఈసోఫాగస్(గొంతు మార్గం) ద్వారా కడుపులోకి చేరుతుంది. తర్వాత కడుపులో ఉన్న ఆమ్లాలు దానిని కరిగించడం ప్రారంభిస్తాయి. కొన్ని మాత్రలు వెంటనే కరుగుతాయి. మరికొన్ని ఆలస్యంగా పనిచేస్తాయి. మాత్రలోని ఔషధ పదార్థాలు చిన్నపేగు ద్వారా రక్తంలోకి శోషణం చెందుతాయి. ఇది అత్యంత కీలక దశగా వైద్య నిపుణులు చెబుతారు. రక్తం ద్వారా అందులోని ఔషధాలు శరీరంలోని వివిధ భాగాలకు చేరతాయి. అవసరమైన అవయవం వద్ద అది ఎక్కువగా పనిచేస్తుంది. ఇక్కడే అసలు పని ప్రారంభమవుతుంది.

నొప్పి మందులైతే నాడీ వ్యవస్థపై పనిచేస్తాయి. ఁ ఁాంటీబయోటిక్స్ అయితే బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. ఇతర మందులు హార్మోన్లు లేదా రసాయన చర్యలను నియంత్రిస్తాయి. లివర్(కాలేయం) ఔషధాన్ని రసాయన మార్పులకు గురిచేస్తుంది.

## మండల పట్టణాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకం



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / సెప్టెంబర్ 03 / అక్షరం న్యూస్ –:

తెలంగాణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పెద్దపల్లి నియోజకవర్గంలోని మండల మరియు పట్టణాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియమించినట్లు గురువారం రోజున ప్రకటించారు ఈ సందర్భంగా పెద్దపల్లిలోని ఆరు మండలాల మరియు పట్టణ అధ్యక్షులను నియమించారు 1) పెద్దపల్లి మండలం: కట్కూరి సుధాకర్ రెడ్డి. 2).పెద్దపల్లి పట్టణం: భూతగడ్డ సంపత్. 3).సుల్తానాబాద్ మండలం: చిలుక సతీష్ బాబు. 4).సుల్తానాబాద్ పట్టణం: వేగోలపు అబ్బయ్య గౌడ్. 5).ఎలిగేడు మండలం: సామ రాజేశ్వర్ రెడ్డి. 6).జూలపల్లి మండల: బొజ్జ శ్రీనివాస్. 7).ఓదెల మండలం: మూల ప్రేమ్ సాగర్ రెడ్డి. 8).కాల్వ శ్రీరాంపూర్ మండలం: గజవేన సదయ్య యాదవ్. పేర్లను ఖరారు చేశారు పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ పైన తెలిపిన వారిని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు సిఫారసు మేరకు పెద్దపల్లి నియోజకవర్గంలోని మండలాల మరియు పట్టణాల అధ్యక్షులుగా అధికారికంగా నియమించడం జరిగిందని వీరి నియామకం గురువారం రోజున నుండి అమలులోకి వస్తుందని తెలిపారు. నూతనగా మండల మరియు పట్టణ అధ్యక్షులుగా నియమితులైన వారందరూ తమ నియామకానికి పూర్తి స్థాయిలో వెన్నుదన్నుగా ఉండి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావుకి, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కి మరియు కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరియు పార్టీ ప్రతిష్ఠకు ఎలాంటి భంగం కలగకుండా పూర్తి స్థాయిలో సహకరిస్తామని వారు తెలిపారు.

## మా పట్టా భూమిలో అక్రమంగా డ్రైనేజీ పనులు

- **నోటీసు ఇవ్వకుండానే మున్సిపల్ అధికారుల చర్యలు.**
- **కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు.**



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / సెప్టెంబర్ 03 / అక్షరం న్యూస్ –:

తమకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, నోటీసులు జారీ చేయకుండా తమ పట్టా వ్యవసాయ భూమిలో మున్సిపల్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారని ఆరోపిస్తూ బాధితులు నీలారపు సతీష్, నీలారపు మురళి గురువారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని చందపల్లి గ్రామ సర్వే నంబర్లు 1110/1, 1110/2లో తమకు వ్యవసాయ భూమి ఉందని వారు పేర్కొన్నారు. తమ భూమి పట్టా భూమి అయినప్పటికీ మున్సిపల్ శాఖ అధికారులు ఎలాంటి చట్టబద్ధమైన నోటీసులు ఇవ్వకుండా, ముందస్తు సమాచారం లేకుండా డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారని ఆరోపించారు. వ్యవసాయ భూమిలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టడం వల్ల తమకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. భూమిని స్వాధీనం చేసుకోవడానికి సంబంధించి ఎలాంటి ప్రక్రియ చేపట్టకుండా, నష్టపరిహారం కూడా చెల్లించకుండా పనులు నిర్వహించడం సరికాదని వారు తెలిపారు. తమ కుటుంబానికి చెందిన పట్టా భూమిలో అక్రమంగా డ్రైనేజీ తీయడం వల్ల వ్యవసాయ కార్యకలాపాలకు ఆటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయడంతో పాటు డ్రైనేజీ నిర్మాణంపై విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ విషయంపై అధికారులు స్పందించి తమ భూమి హక్కులను పరిరక్షించాలని, న్యాయమైన పరిష్కారం చూపాలని నీలారపు సతీష్, నీలారపు మురళి విజ్ఞప్తి చేశారు.

## ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ కాపీ అందజేసిన కౌన్సిలర్ పొనగంటి విష్ణు




కరీంనగర్/జమ్మికుంట/సెప్టెంబర్ 03/అక్షరం న్యూస్: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులకు మంజూరైన ఇంటి ప్రొసీడింగ్ కాపీలను జమ్మికుంట 11 వార్డు మున్సిపల్ కౌన్సిలర్ పొనగంటి విష్ణు మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడిన ఆయన, ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందించే సహాయాన్ని సక్రమంగా వినియోగించుకుని, త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


### ఆదాయానికి మించిన ఆస్తులు..

# టౌన్ ప్లానింగ్ అధికారి సోమయ్యపై ఏసీబీ కేసు



**రూ.3.54 కోట్ల ఆస్తులు గుర్తింపు.. ఇళ్లు, ప్లాట్లు, భూములు, బంగారం స్వాధీనం**

సూర్యాపేట/టౌన్ , సెప్టెంబర్ 3: అక్షరం న్యూస్: ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై సూర్యాపేట మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి వి. సోమయ్యపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు నమోదు చేసింది. నల్గొండ రేంజ్ ఏసీబీ అధికారులు గురువారం సూర్యాపేటతో పాటు హైదరాబాద్‌లోని ఆయన నివాసం, కార్యాలయం, బంధువులు, సహచరులకు సంబంధించిన మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. సోదాల్లో సూర్యాపేట జిల్లాలో 3 ఎకరాల 3 గుంటల వ్యవసాయ భూమి, సూర్యాపేట, హయత్‌నగర్ పరిధిలో ఐదు నివాస ఆస్తులు, సూర్యాపేట పరిధిలో ఎనిమిది ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. నివాస ఆస్తుల్లో జీ+1, జీ+2, జీ+4 భవనాలతో పాటు పెంట్‌హౌస్, రెండు గ్రౌండ్‌ఫ్లోర్ ఇళ్లు ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా 709 గ్రాముల బంగారం, 1,750 గ్రాముల వెండి, రూ. 4,63,990 నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ. 13 లక్షల నిల్వలు గుర్తించారు. బంగారం, వెండి విలువ సుమారు రూ. 20 లక్షలుగా అంచనా వేశారు. రెండు నాలుగు చక్రాల వాహనాలు, మూడు ద్విచక్ర వాహనాలు కలిపి సుమారు రూ. 25.20 లక్షల విలువైన వాహనాలను గుర్తించారు. ఇంట్లోని గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల విలువను సుమారు రూ. 11 లక్షలుగా అంచనా వేశారు.



**రూ. 49 లక్షల బంగారు రుణం**

బంగారాన్ని తాకట్టు పెట్టి బ్యాంకు ద్వారా సుమారు రూ. 49 లక్షల రుణం పొందినట్లు ఏసీబీ గుర్తించింది. ఇప్పటివరకు గుర్తించిన ఆస్తులు, నగదు, బంగారం, వాహనాలు తదితరాల విలువను కలిపి రూ. 3,54,36,490గా ప్రాథమికంగా అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు. ఆస్తుల మార్కెట్ విలువ అధికారిక విలువ కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. సోమయ్య ఆదాయ వనరులతో పోలిస్తే గుర్తించిన ఆస్తులపై ఏసీబీ అధికారులు మరింత దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం సోమయ్యను హైదరాబాద్‌లోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలించనున్నట్లు అధికారులు వెల్లడించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## చెట్లు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం

- **15వ వార్డు ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి.**



పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు వార్డు కౌన్సిలర్ పెంజర్ల రాకేష్.

పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / సెప్టెంబర్ 03 / అక్షరం న్యూస్–:

వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 15వ వార్డులో ప్రజలకు మొక్కలను పంపిణీ చేసి, ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆకుల వెంకటేష్ కౌన్సిలర్ పేంజర్ల రాకేష్ మాట్లాడుతూ చెట్లు మనకు స్వచ్ఛమైన గాలిని అందించడంతో పాటు వాతావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఒక్కొక్కరు ఒక మొక్క నాటి, దానిని సంరక్షిస్తే భవిష్యత్ తరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చు. చెట్లు నాటడం మాత్రమే కాదు. వాటిని పెంచి సంరక్షించడం మనందరి బాధ్యత" అని అన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, పర్యావరణ పరిరక్షణకు తన వంతు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్లు సురేష్ అరవింద్ ఆర్ పి రజిత నర్సరీ స్టాఫ్ సునీత యశోద వార్డు ప్రజలు రాజు సురేందర్ మణిదీప్ మహేష్ మనోజ్ లక్కీ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## వీణవంకలో బీఆర్ఎస్ భారీ నిరసన



కరీంనగర్/వీణవంక/సెప్టెంబర్ 03/అక్షరం న్యూస్:

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన వైఫల్యాన్ని నిరసిస్తూ వీణవంకలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 2 వేల మంది పాల్గొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని నాయకులు ఆరోపించారు. "కాంగ్రెస్ బాకీ కార్డు" పంపిణీ చేసి ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ – రైతు భరోసా, రూ. 2 లక్షల రుణమాఫీ, వడ్లకు రూ. 500 బోనస్, మహిళలకు రూ. 2500, తులం బంగారం, స్కూటీ, పెంచిన పింఛన్లు, నిరుద్యోగ భృతి, 2 లక్షల ఉద్యోగాలు వంటి ఏ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. యూరియా కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. హామీలు అమలయ్యే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ముసిపట్ల తిరుపతిరెడ్డి, మాట సదాశివరెడ్డి, జమ్మికుంట, పిఎసిఎస్, చైర్మన్. పొనగంటి సంపత్, మాజీ మార్కెట్ చైర్మన్ బాలకిషన్ రావు, టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## కేజీబీవీ ఓదెలలో "మైండ్‌సెట్ ఆఫ్ ఎ మేకర్"కు శ్రీకారం



ఓదెల పెద్దపల్లి సెప్టెంబర్ 03 అక్షరం న్యూస్

ఓదెల కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు సమస్యల పరిష్కారానికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు: పుస్తకాల్లోని జ్ఞానాన్ని దాటి, "ఆలోచించు.. ప్రయోగించు.. సృష్టించు.. ఆవిష్కరించు" అనే దృక్పథంతో విద్యార్థులను భవిష్యత్ ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దే దిశగా కేజీబీవీ. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, వారు ఎదుర్కొనే సమస్యలకు స్వయంగా పరిష్కారాలను ఆలోచించి రూపొందించేలా ప్రోత్సహించేందుకు "మైండ్‌సెట్ ఆఫ్ ఎ మేకర్" కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని టి–వర్క్స్ మరియు డ్రీమ్ స్టార్ట్ రైజ్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ సంయుక్తంగా నిర్వహిస్తోంది. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డిజైన్ థింకింగ్, సమస్య పరిష్కారం, సృజనాత్మక ఆలోచన, ఐడియా జనరేషన్, ప్రోటోటైపింగ్ మరియు ప్రాక్టికల్ లెర్నింగ్ వంటి అంశాలపై శిక్షణ అందించనున్నారు. తమ పరిసరాల్లోని సమస్యలను గుర్తించడం, వాటిని అర్థం చేసుకోవడం, కొత్త ఆలోచనలను రూపొందించడం, వాటిని ప్రోటోటైప్‌లుగా అభివృద్ధి చేయడం వంటి ప్రక్రియల ద్వారా విద్యార్థుల్లో చేసి నేర్చుకునే విధానాన్ని పెంపొందించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, సమస్య పరిష్కార నైపుణ్యాలు, ప్రయోగాత్మక దృక్పథం మరియు ఆవిష్కరణ సామర్థ్యం మరింతగా అభివృద్ధి చెందుతాయని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులను కేవలం నేర్చుకునే వారిగా కాకుండా, సమస్యలను గుర్తించి పరిష్కారాలను సృష్టించే భవిష్యత్ మేకర్లుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ కే జ్యోతి మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## వీణవంక మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకులంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



కరీంనగర్/హుజురాబాద్/, సెప్టెంబర్ 03/అక్షరం న్యూస్: హుజురాబాద్ పట్టణంలోని వీణవంక మహాత్మా జ్యోతిబాపూలే (బాలుర) గురుకుల పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మందారపు సంపత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధాదేవి, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రాంగణాన్ని రంగురంగుల పూలతో, బెలూన్లతో అందంగా అలంకరించారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, భజన గీతాలు అందరినీ అలరించాయి. అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మందారపు సంపత్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణుని జీవితం, భగవద్గీత బోధనలు నేటి విద్యార్థులకు ఆదర్శప్రాయమని, క్రమశిక్షణ, ధర్మమార్గంలో నడవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన ఎంఈఓకు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం సన్మానం

- మర్యాదపూర్వకంగా కలిసిన ట్రస్మా ప్రతినిధులు...




హన్మకొండ జిల్లా/భీమదేవరపల్లి/ సెప్టెంబర్ 03/అక్షరం న్యూస్:–

మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ)గా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన భూక్య శంకర్ నాయక్‌ను భీమదేవరపల్లి మండల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ఆయనకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.ఇంతకుముందు ఇక్కడ ఎంఈఓగా సేవలందించిన సునీతారాణి పదవీ విరమణ పొందడంతో మాణిక్యాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న భూక్య శంకర్ నాయక్ ఇన్‌చార్జ్ ఎంఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రస్మా మండల ప్రతినిధులు మాట్లాడుతూ..ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రైవేట్ పాఠశాలల సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు కాశిరెడ్డి ఆదిరెడ్డి స్పష్టం చేశారు. అనంతరం ఎంఈఓ శంకర్ నాయక్ మాట్లాడుతూ..మండలంలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా మండల ప్రతినిధులు యాదగిరి, అశోక్, ఉమామహేశ్వర్, కాశిరెడ్డి ఆదిరెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సంక్షేమ పాలనకు ప్రజలు బ్రహ్మారథం



హన్మకొండ జిల్లా/భీమదేవరపల్లి/ సెప్టెంబర్ 03/అక్షరం న్యూస్:

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు నేరుగా అర్హులైన ప్రజలకు అందుతున్నాయని కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి అన్నారు.భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని అంబేద్కర్ కూడలి వద్ద గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యకర్తలు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పోచంపల్లి రాజిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాల వివరాలను తీసుకెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రమోద్‌రెడ్డి, జక్కుల అనిల్, అశోక్ ముఖర్జీ, కొలుగూరి రాజు, ఊస కోయిల ప్రకాష్, ఆదరి రవీందర్, స్వరూప, మురళి, గోపి, రమేష్, జైపాల్‌రెడ్డి, తకిల్, సదానందం, గోపాల్, రామచంద్రం, కొమురయ్య, శంకర్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వన భోజన మహోత్సవం



ఓదెల పెద్దపల్లి సెప్టెంబర్ 03 అక్షరం న్యూస్

ఓదెల మండలంలోనిహరిపురం గ్రామంలో గురువారం వన భోజన మహోత్సవాన్ని గ్రామ ప్రజలందరూ ఐక్యంగా, భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా హరిపురం గ్రామ సర్పంచ్ గ్యారవేని విజయ నాగరాజు యాదవ్ గ్రామ ప్రజలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరుణ దేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, రైతులకు మంచి దిగుబడులు రావాలని, గ్రామం సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని ప్రార్థించారు.అనంతరం గ్రామ ప్రజలందరూ తమ తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### హుజురాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా

# 1000 రోజుల ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీలు...





- 1000 రోజుల కాంగ్రెస్ పాలన సూపర్ హిట్టు,అట్టర్ ఫ్లాప్ లో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ..
- ఉనికి కోసమే బీఆర్ఎస్,కౌశిక్ రెడ్డి దొంగ డ్రామాలు..
- సన్న బియ్యం,ఇందిరమ్మ ఇళ్లు,200 యూనిట్ల ఉచిత విద్యుత్,రేషన్ కార్డులు,500 బోనస్,సీఎంఆర్ఎఫ్ చెక్కులు,ఆరోగ్య శ్రీ 10లక్షలకు పెంపు,రైతులకు 500 బోనస్,రైతు భరోసా,రుణమాఫీ,నిరుద్యోగులకు 67వేల ఉద్యోగాలు లాంటి అనేక సంక్షేమ పథకాలతో ప్రజల మనసు గెలుచుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం..
- మండల,పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయోత్సవాలు,భారీగా పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు..
- 1000 రోజుల్లో కౌశిక్ రెడ్డి హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి తీసుకొచ్చింది 0000..
- హుజురాబాద్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ,ప్రణవ్ తోనే సాధ్యం..
- కౌశిక్ రెడ్డి హుజురాబాద్ అభివృద్ధి నిరోధకుడు,తీవ్ర స్థాయిలో మండిపడిన కాంగ్రెస్ నాయకులు..

కరీంనగర్/ హుజురాబాద్/ సెప్టెంబర్ 03/ అక్షరం న్యూస్:

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తైన సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో ఘనంగా విజయోత్సవ సంబురాలు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జరుపుకున్నారు.పీసీసీ,డీసీసీ,హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆదేశాలతో పట్టణ,మండల ప్రధాన కూడళ్లలో భారీర్యాలీ నిర్వహించారు.పదేళ్ల బిఆర్ఎస్ పాలన అనంతరం తెలంగాణ ప్రజలు కోరి తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వంలో ప్రతివర్గానికి న్యాయం చేస్తున్నామని,పదేళ్లు అధికారంలో బీఆర్ఎస్ చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే చూసి ఓర్చుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు.ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూనే మరిన్ని సంక్షేమ పథకాలను జనాలకు అందజేసిందని అన్నారు..1000 రోజుల ప్రజా పాలన విజయోత్సవ ర్యాలీలు హుజురాబాద్ లో ఘనంగా నిర్వహించారు.స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి 500 మందితో అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి,బాణాసంచా కాల్చి,కేక్ కట్ చేశారు.అనంతరం హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళు ుందని హుజూరాబాద్ అభివృద్ధికి ఇక్కడ ఇంచార్జి గా ఉన్న ప్రణవ్ బాబు నిత్యం మంత్రులతో,అధికారులతో మాట్లాడి నిధులు తీసుకొస్తున్నారని,ఇక్కడ ప్రజల ఓట్లతో గెలిచి వారి అభివృద్ధిని పట్టించుకోకుండా కౌశిక్ రెడ్డి అభివృద్ధి నిరోధకుడిగా మారాడని ఆగ్రహం వ్యక్తంచేశారు.హుజురాబాద్ అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీ,ప్రణవ్ బాబుకే సాధ్యమని అన్నారు.ఎన్నికల్లో గెలిచిన తర్వాత కౌశిక్ రెడ్డి 1000 రోజుల్లో హుజురాబాద్ కి సున్నా నిధులు తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,వైస్ చైర్ పర్సన్ అంజలి,కౌన్సిలర్లు,జిల్లా అధికార ప్రతినిధులు,జనరల్ సెక్రటరీలు,మహిళ నాయకురాళు ్లు,మండల పట్టణ నాయకులు, సేవాదళ్,మైనారిటీ,యువజన,యూత్,ఎన్ఎస్యూఐ,సోషల్ మీడియా, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### జమ్మికుంట..

జమ్మికుంట పట్టణంలో 1000 రోజుల ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు.మండల అధ్యక్షుడు పరశురామారావు,పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో కోరపల్లి గ్రామం నుండి అంబేద్కర్ చౌరస్తా మీదుగా గాంధీచౌరస్తా వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల్లో ప్రజలకు దగ్గరయ్యే అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని వాటి ద్వారా ప్రజలకు మరింతగా ప్రభుత్వం ప్రజలకు దగ్గరగా అయ్యారని అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ స్వప్న,వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి,డైరెక్టర్లు, జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు,ఉప సర్పంచులు,మహిళ పట్టణ, మండల అధ్యక్షురాల్లు, మండల,పట్టణ కాంగ్రెస్ నాయకులు,ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

### ఇల్లందకుంట..

ఇల్లందకుంట మండలంలో మండల అధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో ప్రజా పాలన విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు.ఇల్లందకుంట మండల అధ్యక్షులు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రం నుండి పుర వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించి బాణాసంచా కాల్చి కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు.సంక్షేమ పథకాలు,అభివృద్ధి పథకాలతో ప్రజల మనసు గెలుచుకున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని,కౌశిక్ రెడ్డికి చిత్త శుద్ధి ఉంటే నియోజవర్గానికి నిధులు తీసుకొచ్చి మాట్లాడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట దేవాలయ చైర్మన్ రామారావు,డైరెక్టర్లు,సర్పంచులు,మహిళా అధ్యక్షురాలు,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### కమలాపూర్..

కమలాపూర్ మండల కేంద్రంలో స్థానిక మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వాసాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రజాపాలన 1000 రోజుల విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడుతూ పదేళ్లలో ఒక్క డబుల్ బెడ్ రూం ఇవ్వని బిఆర్ఎస్ ప్రభుత్వం,కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ ఇళ్ళతో ప్రజలు సంతోషంగా ఉంటే బిఆర్ఎస్ నాయకులు అక్కసు వెళ్లగక్కుతున్నారని,వారు చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే చూసి ఓర్వలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇకనైనా పద్ధతి మార్చుకొని ప్రతిపక్ష హోదాను సక్రమంగా ఉపయోగించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ ఝాన్సీ,డైరెక్టర్లు,కమలాపూర్ మండల సర్పంచులు,ఉప సర్పంచులు,మండల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# తరచూ నెలసరి నొప్పులు వస్తున్నాయా..? మహిళలు దీన్ని అసలు నిర్లక్ష్యం చేయకూడదు..!

మహిళలు నెలసరి నొప్పులను సాధారణంగా భావిస్తారు. చాలా మంది మహిళలు వీటిని అసలు పట్టించుకోరు. అయితే ఈ నొప్పి తీవ్రంగా మారి రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేసే స్థాయికి చేరుకుంటే, దాన్ని సాధారణంగా తీసుకోవద్దని వైద్యులు సూచిస్తున్నారు. ఇలాంటి తీవ్రమైన నొప్పులు సెకండరీ డిస్మెనోరియా అనే తీవ్రమైన సమస్యకు సంకేతం కావొచ్చని వారుహెచ్చరిస్తున్నారు. తీవ్రమైన లక్షణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదని ప్రతి నెల మందులపై ఆధారపడటం, స్కూల్ లేదా పనికి వెళ్లలేకపోవడం వంటి పరిస్థితులు ప్రమాద సూచికలుగా భావించాలని వైద్యులు చెబుతున్నారు. అలాగే నొప్పి కాలక్రమేణా నొప్పి తీవ్రత పెరగడం లేదా పీరియడ్ సమయంలో కాకుండా ఇతర సమయాల్లో కూడా నొప్పి ఉండడం వంటి వాటిని తేలికగా తీసుకోకూడదని ఈ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు.

### రెండు రకాలుగా ఉంటాయి..

నెలసరి నొప్పులను సాధారణంగా రెండు రకాలుగా విభజిస్తారు. మొదటిది ప్రైమరీ డిస్మెనోరియా. ఇది సాధారణంగా ఏదైనా ప్రత్యేక కారణం లేకుండా వస్తుంది. ఇది ప్రోస్టాగ్లాండిన్స్ అనే హార్మోన్‌లాంటి రసాయనాల వల్ల గర్భాశయం సంకోచాలు కలగడం వల్ల వస్తుంది. సాధారణంగా మందులు, జీవనశైలి మార్పులతో దీనిని



నియంత్రించవచ్చు. ఇక రెండవది సెకండరీ డిస్మెనోరియా. ఇది గర్భాశయానికి సంబంధించిన ఇతర ఆరోగ్య సమస్యల వల్ల వస్తుంది. దీని వల్ల వచ్చే నొప్పి ఎక్కువగా తీవ్రంగా ఉంటుంది, కాలక్రమేణా పెరుగుతుంది. అదనంగా అధిక రక్తస్రావం, అలసట, పీరియడ్ కాకుండా కూడా పెల్విక్ నొప్పి, మల విసర్జన లేదా లైంగిక సంబంధాల సమయంలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి.

### 20 నుంచి 40 శాతం మంది మహిళల్లో..

సెకండరీ డిస్మెనోరియాకు ప్రధాన కారణాలలో ఒకటి ఎండోమెట్రియోసిస్. ఇందులో గర్భాశయపు లోపలి పొరల మాదిరిగా ఉండే కణజాలం గర్భాశయం బయట పెరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 10 శాతం మహిళలు ఈ సమస్యతో బాధపడుతున్నారు. భారతదేశంలో సుమారు 4.2 కోట్ల మంది మహిళలు ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు అంచనా. దీర్ఘకాలిక పెల్విక్ నొప్పితో బాధపడే మహిళల్లో 30–70 శాతం వరకు ఈ వ్యాధి ఉండే అవకాశముంది. అయినప్పటికీ ఈ సమస్య చాలా సందర్భాల్లో గుర్తించబడదు. అలాగే నెలసరి సమయంలో తీవ్రమైన నొప్పి రావడానికి మరొక కారణం గర్భాశయంలో ఏర్పడే ఫైబ్రాయిడ్స్ (గడ్డలు). ఇవి క్యాన్సర్ కాని గడ్డలు అయినప్పటికీ 20–40 శాతం భారతీయ మహిళల్లో కనిపిస్తాయి. ముందుగా ఇవి పెద్ద వయస్సులో మాత్రమే కనిపిస్తాయని భావించేవారు. కానీ ప్రస్తుత కాలంలో యువతుల్లో కూడా ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. జీవనశైలి మార్పులు, కాలుష్యం, ప్రాసెస్ చేసిన ఆహారం, ఒత్తిడి, స్థూలకాయం, ప్లాస్టిక్‌లో ఉండే హానికర రసాయనాలు వంటి అంశాలు హార్మోన్ అసమతుల్యతకు దారి తీస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి శరీరంలో ఈస్ట్రోజన్‌ను అనుకరించి వాపులను పెంచి, ఫైబ్రాయిడ్స్, ఎండోమెట్రియోసిస్ వంటి సమస్యలకు కారణమవుతున్నాయని వారు తెలియజేస్తున్నారు.

### మందులు దీర్ఘకాలం వద్దు..

నెలసరి నొప్పుల కోసం ఎక్కువగా ఉపయోగించే ఐబుప్రోఫెన్ వంటి నాన్–స్టెరాయిడల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ మందులు తాత్కాలిక ఉపశమనం ఇస్తాయి. కానీ దీర్ఘకాలం వాడితే జీర్ణాశయ సమస్యలు, అల్సర్లు, కిడ్నీ సమస్యలు, రక్తపోటు వంటి ప్రమాదాలు కలుగుతాయని, ముఖ్యంగా ఇవి అసలు సమస్యను దాచిపెట్టే ప్రమాదం కూడా ఉందని వైద్యులుహెచ్చరిస్తున్నారు.

## శరీరానికి ఐరన్ లభించాలంటే.. ఈ ఆహారాలను తీసుకోవాలి..



ఇనుము మనిషి శరీరానికి అత్యంత అవసరమైన ఖనిజం. ఇది హిమోగ్లోబిన్ తయారీలో కీలక పాత్ర పోషిస్తుంది. హిమోగ్లోబిన్ రక్తం ద్వారా ఆక్సిజన్‌ను శరీరమంతా చేరవేయ డానికి సహాయపడుతుంది. శరీరంలో ఇనుము సరిపడినంత ఉండటం వల్ల శక్తి స్థాయిలు, మెదడు పనితీరు మెరుగ్గా ఉంటాయి.

### దానిమ్మ పండ్లు, బీట్ రూట్..

వేసవిలో ఐరన్ ను పెంచుకోడానికి దానిమ్మ పండు మంచి ఎంపిక. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, ఇనుము, ఫైబర్, పొటాషియం వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, జీర్ణక్రియను సులభతరం చేయడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. పాలకూర కూడా ఇనుముకు మంచి వనరు. ఇది నాన్-హీమ్ ఐరన్ కలిగి ఉండటంతో శరీరానికి ఉపయోగపడుతుంది. దీనిని సలాడ్లు, పప్పు లేదా స్మూతీల రూపంలో తీసుకోవచ్చు. బీట్‌రూట్ రక్త ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది రెడ్ బ్లడ్ సెల్స్ ఉత్పత్తిని పెంచడంలో సహాయపడుతుంది. వేసవిలో దీన్ని సలాడ్ లేదా రైతా రూపంలో తీసుకోవచ్చు. పప్పులు, శనగలు వంటి ఆహారాలు కూడా మంచి ఐరన్ వనరులు. ఇవి శాకాహారులకు ఉత్తమమైన ఎంపికగా నిలుస్తాయి, రోజువారీ ఆహారంలో సులభంగా చేర్చుకోవచ్చు. పుచ్చకాయలో ఇనుము తక్కువగా ఉన్నప్పటికీ, వేసవిలో శరీరాన్ని హైడ్రేట్ చేయడంలో ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఇది దాహాన్ని తీర్చడంలో కూడా సహాయపడుతుంది. బెల్లం సహజంగా ఇనుము అందించే ఆహారం. చక్కెరకు బదులుగా కొద్దిగా బెల్లం తీసుకోవడం వల్ల శరీరానికి కొంత ఇనుము లభిస్తుంది. అయితే దీనిని మితంగా మాత్రమే తీసుకోవాలి.

### మునగ ఆకులు, విటమిన్ సి..

మునగలో ప్లాంట్-బేస్డ్ ఐరన్ అధికంగా ఉంటుంది. ఇందులో విటమిన్ సి కూడా ఉండటంతో ఐరన్ శోషణను మెరుగుపరుస్తుంది. అందువల్ల ఇది ప్రత్యేకంగా ఉపయోగకరమైన ఆహారమని చెప్పవచ్చు. ఇవే కాకుండా గింజలు, విత్తనాలు, పూర్తి ధాన్యాలు, చేపలు, డ్రై ఫ్రూట్స్ కూడా ఐరన్ మంచి వనరులుగా పరిగణించబడతాయి. ఈ ఆహారాలను తీసుకోవడంతోపాటు ఐరన్ శోషణను మెరుగుపరచడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. హీమ్, నాన్-హీమ్ ఐరన్ రెండింటినీ కలిపి తీసుకోవడం మంచిది. అలాగే విటమిన్ సి ఉన్న ఆహారాలను ఐరన్ ఉన్న భోజనంతో తీసుకుంటే శరీరం ఐరన్‌ను సులభంగా గ్రహిస్తుంది. అదేవిధంగా టీ, కాఫీ, కాల్షియం వంటి పదార్థాలను ఐరన్ ఉన్న భోజనంతో కలిసి తీసుకోవడం నివారించాలి, ఎందుకంటే ఇవి ఐరన్ శోషణను తగ్గిస్తాయి. వేసవిలో ఈవిధంగా సరైన ఆహారం, మంచి అలవాట్ల ద్వారా శరీరంలో ఇనుము స్థాయిని సులభంగా పెంచుకోవచ్చు. ఇది ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని వైద్యులు తెలియజేస్తున్నారు.

## పాదాల వద్ద వాపులు తరచూ వస్తున్నాయా..? అందుకు కారణాలేంటి.. ఏం చేయాలి..?

ఎక్కువసేపు నిలబడటం, ప్రయాణాలు చేయడం లేదా ఒకే స్థితిలో కూర్చోవడం వల్ల చీలమండలు వాపు రావడం సాధారణం. అయితే ఈ వాపు తరచుగా కొనసాగితే, అది లోపల ఉన్న ఆరోగ్య సమస్యలకు సంకేతంగా మారవచ్చని వైద్యులు చెబుతున్నారు. వైద్యులు ఇలాంటి పరిస్థితుల్లో ఆంకిల్ స్వెల్లింగ్ టెస్ట్ లేదా పిట్టింగ్ ఎడిమా టెస్ట్ అనే సులభమైన పరీక్ష ద్వారా శరీరంలో ద్రవం నిల్వ ఉందో లేదో పరీక్షచేస్తారు. ఈ పరీక్ష చాలా సులభంగా ఉంటుంది. చీలమండలం దగ్గర లేదా కాలి మోకాలిపై వైద్యుడు కొన్ని సెకన్లు వేళ్లతో నొక్కి వదిలేస్తారు. నొక్కిన తర్వాత చర్మం వెంటనే మామూలు స్థితికి వస్తే పెద్ద సమస్య ఉండకపోవచ్చు. కానీ ఆ చోట చిన్న గుంతలా మిగిలితే దానిని పిట్టింగ్ ఎడిమా అంటారు. ఇది శరీరంలో ద్రవం ఎక్కువగా నిల్వ ఉన్న సంకేతంగా పరిగణించబడుతుంది.

### కారణాలు ఇవే..

శరీరంలో ద్రవం ఎక్కువగా పేరుకుపోవడానికి ముఖ్య కారణం రక్తప్రసరణలో లేదా ద్రవ సమతుల్యంలో లోపం రావడం. గురుత్వాకర్షణ వల్ల ఈ ద్రవం కాళ్లు, పాదాల దగ్గర ఎక్కువగా చేరుతుంది. గుండె, మూత్రపిండాలు లేదా కాలేయం సరిగా పనిచేయకపోతే ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. గుండె సంబంధిత సమస్యలు ఉన్నప్పుడు కూడా కాళ్ల వాపు కనిపించవచ్చు. ముఖ్యంగా గుండె రక్తాన్ని సరిగ్గా పంపించలేకపోతే రక్తప్రసరణ మందగిస్తుంది. దీని వల్ల ద్రవం కాళ్లలో పేరుకుపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, అకస్మాత్తుగా బరువు పెరగడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. అలాగే మూత్రపిండాలు శరీరంలో ఉండే అదనపు నీరు, ఉప్పును బయటకు పంపడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. అవి సరిగా పనిచేయకపోతే ద్రవం శరీరంలోనే నిల్వ అయి కాళ్లు, పాదాలు, కొన్నిసార్లు ముఖం కూడా వాపు రావచ్చు.

### ఇలా కూడా జరగవచ్చు..

దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి ఉన్నవారిలో ఈ సమస్య క్రమంగా పెరుగుతూ కనిపిస్తుంది. అయితే ప్రతి కాళ్ల వాపు ప్రమాదకరమే అనుకోవాల్సిన అవసరం లేదు. ఎక్కువసేపు కూర్చోవడం, నిలబడటం, అధిక ఉప్పు తీసుకోవడం, గర్భధారణ లేదా కొన్ని మందులు వాడటం వల్ల కూడా తాత్కాలికంగా వాపు రావచ్చు. అలాగే రక్తనాళాల సమస్యలు ఉన్నప్పుడు కూడా కాళ్లలో ద్రవం చేరుతుంది. సాధారణంగా కొద్దిగా వాపు వస్తే పెద్దగా ఆందోళన అవసరం లేదు. కానీ వాపు ఎక్కువకాలం కొనసాగితే, పెరుగుతూ ఉంటే లేదా ఇతర లక్షణాలతో కలిసి ఉంటే మాత్రం వెంటనే వైద్యులను సంప్రదించాలి.

### ఈ లక్షణాలు ఉంటే..

ముఖ్యంగా శ్వాసలో ఇబ్బంది, ఛాతి నొప్పి, ఆకస్మిక బరువు పెరుగుదల, తీవ్రమైన అలసట, మూత్ర విసర్జన తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. వైద్యులు అవసరమైతే రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు లేదా స్కానింగ్ వంటి పరీక్షలు చేసి అసలు కారణాన్ని గుర్తిస్తారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యవస్థను విధ్వంసం చేసింది దాసరి



ఓదెల పెద్దపల్లి సెప్టెంబర్ 03 అక్షరం న్యూస్

ఓదెల మండల కేంద్రంలో మారుతి ఫంక్షన్ హాల్ లో గురువారం భారత రాష్ట్ర సమితి పిలుపు మేరకు రైతు విధ్వంసం పై రైతులతో సమావేశం మండల పార్టీ అధ్యక్షులు ఐరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి హాజరయ్యారు చాలామంది రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక కష్టాలు పడుతున్నామని ఎరువులు దొరకక విత్తనాలు దొరకక సరియైన టైం కు దాన్యం అమ్మిన డబ్బులు పడక అనేక అవస్థలు పడుతున్నామని అమ్మేటప్పుడు కూడా చాలా అవస్థలు పడ్డామని కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా అత్యధిక దిగుబడి తీసుకోవడం జరిగిందని ఇప్పుడు ఎరువులు దొరకక దిగుబడి పూర్తిగా పడిపోయే పరిస్థితి వచ్చిందని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులను ఒక బిచ్చగాళ్ళ లేక చేశారని ఆవేదన వ్యక్తం చేశారు

అనంతరం మాజీ తాజా జెడ్పిటిసి గంట రాములు యాదవ్ మాట్లాడుతూ

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత రైతులకు కష్టాలు మొదలైన అని ఎరువులు కొనాలన్నా దినుసు అమ్మాలన్న. అనేక ఇబ్బందులు గురవుతున్నారని రైతు రాజ్యమని చెప్పుకునే నాయకులు చెరువులను విధ్వంసం చేసి నల్లమట్టి అమ్ముకోవడం జరుగుతుందని కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు చెరువులను మిషన్ కాకతీయతో అభివృద్ధి చేసి అందులో వెళ్లిన మట్టిని రైతుల పొలాల్లో వేసుకొని సారవంతమైన భూములను తయారుచేసిన ఘనత కేసిఆర్ ప్రభుత్వాన్నిదని అన్నారు ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి చెరువును. నల్ల మట్టి పోలీసుల నిర్బంధంతో అమ్ముకొని విధ్వంసం చేసిన ఘనత ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అన్నారు రాబోయే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త ఒక సైనికుడు లెక్క పనిచేసి మళ్ళీ కేసీఆర్ను ముఖ్యమంత్రి చేసే విధంగా అందరు కృషి చేయాలని పిలుపునిచ్చారు

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ

ఎద్దు ఏడ్చిన యవసం రైతు ఏడ్చిన రాజ్యం ఏ రోజు బాగుపడదని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని వ్యవసాయ సాగునీటి రంగాలపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 33 నెలలు దాదాపు 1000 రోజులు పూర్తయిన రైతులకు ప్రజలకు ఇచ్చిన హామీలు అనేకం అమలు కాలేదని విమర్శించారు కెసిఆర్ ప్రభుత్వం ఆయనలో ప్రతి నది ప్రతి చెరువు కుంట నీటితో నిండుకుండలా కళకళలాడేదని ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని ఎక్కడ చూసినా ఇసుక దిబ్బలే కనబడుతున్నాయని అన్నారు అంతే కాకుండా రైతులకు నీటి వరదాయని కాళేశ్వరం ప్రాజెక్ట్ ఇప్పటివరకు దాన్ని మరమ్మతులు చేయకపోవడం ఇది ఎలా రైతులను కాపాడినట్లు అవుతుందని ఎద్దేమ చేశారు అంతేకాకుండా ఈ ఓదెల మండలంలో అనేక చెక్ డ్యాములు ధ్వంసమై ఇన్ని రోజులు అవుతున్న కనీసం దానిపై ఎలాంటి చర్యలు లేవని కెసిఆర్ ముందుచూపుతో ప్రతి నీటి చుక్కను పొదుపు చేసి రైతులకు తాగునీరు సాగునీరు అందించే ఉద్దేశంతో వాటిని నిర్మాణం చేశారని అలాంటి వాటిని విద్వాంశం చేసి ఇప్పటివరకు కూడా వాటిని మరమ్మతులకు తావు లేకుండా చేశారని అన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల పేరుతో మోసం చేసి గద్దెనెక్కిన తర్వాత ప్రతి ఒక్కరిని ఇబ్బంది పెడుతుందని కల్యాణ లక్ష్మికి తులం బంగారం 4000 పెన్షన్ కౌలు రైతులకు 12 వేల రూపాయలు గ్రామీణ ఉపాధి హామీ మహిళలకు ప్రతి ఒక్కరికి సంవత్సరానికి 12 వేల రూపాయలు అంతేకాకుండా రైతులకు రెండు లక్షల రుణమాఫీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ యువతులకు స్కూటీలు ఇస్తానని నమ్మబలికి మోసం చేశారని అంతేకాకుండా కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ముందుచూపుతో ఏ రైతైన ఆరోగ్య సమస్యలతో ఆయన ఏదైనా సమస్యతో చనిపోతే వారి కుటుంబం వీధిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరికి ఐదు లక్షల బీమా వచ్చే విధంగా రైతుబిమాను పెట్టిన ఘనత కేసీఆర్ అని దాన్ని ఈరోజు నిర్వీర్యం చేసి రైతు భీమాను కూడా రద్దుచేసి దుర్మార్గమైన పాలన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అని అన్నారు అంతేకాదు అస్తమానం కెసిఆర్.ను తిట్టడమే తప్ప అభివృద్ధి చేయడం చేతకాని ఈ ముఖ్యమంత్రి నీ ఏమనాలో తెలియడం లేదని అన్నారు అంతేకాకుండా రైతులకు సన్నవడ్లకు బోనస్ పేరుతో రైతులను నట్టేట్ల ముంచాడని మండి పడ్డారు 2024లో అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణ పరిస్థితి ఎలాగ ఉండేదో అందరికీ తెలుసని లో కరెంటు నీరు ఎలాంటి పరిస్థితుల్లో ఉండే అని గుర్తు చేశారు అప్పుడు ఎరువు బస్తాల కోసం చెప్పులను లైన్లో పెట్టి రోజుల తరబడి నిలిచిన్న పరిస్థితులు చూసినామని అంతేకాకుండా కరెంటు లో వోల్టేజ్ తో ఎన్నో మోటర్లు కాలిపోవడం కనులారా చూసినమని అంతే కాకుండా టేలాండు ప్రాంతాలకు నీరు అందక ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం కూడా చూసామని అదే కేసీఆర్ వచ్చిన తర్వాత ఏ ఒక రైతు కూడా ఆత్మహత్య చేసుకోకూడదని ఏ ఒక్క ఎకరం కూడా పంట ఎండకూడదని ఉద్దేశంతో 24 గంటలు కరెంటు పుష్కలంగా నీళ్లు కాళేశ్వరం నుండి ప్రతి ఎకరాకు అందించిన ఘనత కేసీఆర్ అని అంతేకాకుండా ఇంటింటికి నాణ్యమైన త్రాగునీరు అందించిన ఘనత కూడా కేసీఆర్కే చెందిందని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఏ ఒక్కటి కూడా కొనసాగించకుండా అన్ని క్రమక్రమేనా తగ్గించుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తో పాటు తాజా మాజీ జెడ్పిటిసి గంట రాములు యాదవ్ మండల పార్టీ అధ్యక్షులు ఐరెడ్డి వెంకటరెడ్డి టిఆర్ఎస్ పార్టీ సర్పంచులు మధ్యన వేణి రవి యాదవ్ గ్యార వేణి విజయ నాగరాజు జీల రాజు మాజీ సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి టిఆర్ఎస్ మండల యువజన నాయకుడు మ్యా ద గోని శ్రీకాంత్ గౌడ్ కొలనూరు ఉప సర్పంచ్ పాకాల సంపత్ రెడ్డి మాజీ సర్పంచులు ఓజ్జా శ్రీనివాస్ ఆళ్ల రాజి రెడ్డి గోవిద్దుల ఎల్ల స్వామి యాదవ్ గుండేటి మధు యాదవ్ పోతుగంటి రాజు బోడ కుంటి నరేష్. బి కుమార్ తీర్థాల కుమార్.. అంబాల కుమార్. రాచర్ల కుమార్. ఎండి సర్వర్. ఆ రెల్లి మొండయ్య. సెనవేన మొండయ్య పోలోజు రమేష్ తో పాటు వివిధ గ్రామాల మాజీ సర్పంచులు ఉప సర్పంచ్లు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

## పర్యావరణానికి ఎంతో మేలు చేసే ప్లానెటరీ హెల్త్ డైట్.. అసలేంటిది.. దీన్ని ఎలా పాటించాలి..?



ఈట్-లాన్సెట్ డైట్ లేదా ప్లానెటరీ హెల్త్ డైట్ అనేది ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా భూమి సహజ వనరులను రక్షించేందుకు రూపొందించిన శాస్త్రీయ ఆహార విధానం. 2019లో 16 దేశాలకు చెందిన 37 మంది నిపుణులు కలిసి ఈ డైట్‌ను రూపొందించారు. 2050 నాటికి 10 బిలియన్ జనాభాకు ఆహారం అందించడంలో పర్యావరణానికి నష్టం కలగకుండా ఉండటం దీని ప్రధాన లక్ష్యం. ఈ డైట్ కఠినమైన నియమాలపై ఆధారపడినది కాదు. వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా మార్చుకునే విధంగా ఉంటుంది. ఇందులో కూరగాయలు, పండ్లు, సంపూర్ణ ధాన్యాలు, పప్పులు, గింజలు ప్రధాన భాగంగా ఉంటాయి. అలాగే పాలు, గుడ్లు, మాంసం వంటి వాటిని చాలా పరిమితంగా మాత్రమే తీసుకోవాలని ఈ డైట్ సూచిస్తుంది. సాధారణంగా పురుషులకు రోజుకు సుమారు 2,500 కేలరీలు, మహిళలకు 2,000 కేలరీలు సూచిస్తారు. ప్లానెటరీ హెల్త్ డైట్ అనేది ప్రపంచవ్యాప్తంగా అనుసరించదగిన రిఫరెన్స్ డైట్‌గా పరిగణించబడుతుంది. ఇది భిన్న ప్రాంతాలు, సంస్కృతులకు అనుగుణంగా మార్పులు చేసుకునే అవకాశం ఇస్తుంది. ముఖ్యంగా మొక్కల ఆధారిత ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలని, జంతు ఆధారిత ఆహారాన్ని తగ్గించాలని సూచిస్తుంది.

### ఏయే ఆహారం ఎంత తీసుకోవాలి..

ఈ డైట్‌లో ఆహారం ఎంత మోతాదులో తీసుకోవాలో కూడా సూచించబడుతుంది. రోజుకు కనీసం 300 గ్రాముల కూరగాయలు, 200 గ్రాముల పండ్లు తీసుకోవాలి. సంపూర్ణ ధాన్యాలు సుమారు 232 గ్రాములు తీసుకోవడం ద్వారా శరీరానికి స్థిరమైన శక్తి లభిస్తుంది. అలాగే పప్పులు 75 గ్రాములు, గింజలు 50 గ్రాములు, ఆరోగ్యకరమైన నూనెలు 40 గ్రాములు తీసుకోవాలి. పాలు, గుడ్లు, చేపలు, చికెన్ వంటి ప్రోటీన్ ఆహారాలను మాత్రం పరిమితంగా తీసుకోవాలి. రోజుకు 250 గ్రాముల పాలు, గుడ్లు ఒకరోజు విడిచి ఒకటి, చేపలు లేదా చికెన్ 29 గ్రాములు మాత్రమే తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎర్ర మాంసం (రెడ్ మీట్) కేవలం 14 గ్రాములకే పరిమితం చేయాలి. అదనపు చక్కెర 31 గ్రాములకు మించకూడదు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ భూమి, నీటి వనరులను భారీగా వినియోగిస్తూ, గ్రీన్ హౌస్ వాయువులను అధికంగా విడుదల చేస్తున్నారు. ఈ డైట్‌ను అనుసరించడం ద్వారా పర్యావరణంపై పడే ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో ఎర్ర మాంసం వినియోగం 80-90% వరకు తగ్గించాల్సిన అవసరం ఉంది.

### అనేక లాభాలు..

ప్లానెటరీ హెల్త్ డైట్ అనుసరించడం వల్ల ఆరోగ్యపరమైన అనేక లాభాలు ఉన్నాయని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులను తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు అధికంగా ఉండటం వల్ల శరీరంలో వాపు, ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. వ్యాధుల బారిన పడే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. హార్వర్డ్ పరిశోధన ప్రకారం, ఈ డైట్‌ను క్రమంగా పాటించడం వల్ల ముందస్తు మరణ ప్రమాదం సుమారు 30% వరకు తగ్గుతుంది. గుండె వ్యాధులు, క్యాన్సర్, స్ట్రోక్, డయాబెటిస్ వంటి వ్యాధుల ప్రమాదం కూడా తగ్గుతుంది. ప్రపంచవ్యాప్తంగా సంవత్సరానికి 11 మిలియన్ మరణాలను నివారించవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు. ఈ డైట్ గుండె, మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలోనూ సహాయపడుతుంది. మొక్కల ఆధారిత ఆహారాలు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి. అలాగే మెదడు పనితీరును కాపాడి మతిమరుపు సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఈ డైట్ ఉపయోగకరంగా ఉంటుంది. ఫైటోకెమికల్స్, విటమిన్లు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల శరీరానికి రక్షణ లభిస్తుంది. ప్రాసెస్డ్ ఫుడ్స్, రెడ్ మీట్ తగ్గించడం ద్వారా క్యాన్సర్ ప్రమాదం తగ్గుతుంది

### పర్యావరణ పరిరక్షణ కూడా..

పర్యావరణ పరిరక్షణలో కూడా ఈ డైట్ కీలక పాత్ర పోషిస్తుంది. గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను 29% వరకు తగ్గించడమే కాకుండా, ఎరువుల వినియోగాన్ని 21% వరకు తగ్గిస్తుంది. వ్యవసాయ భూమి అవసరాన్ని కూడా 51% వరకు తగ్గించే సామర్థ్యం ఉంది. ప్లానెటరీ హెల్త్ డైట్ అనేది ఆరోగ్యానికి, పర్యావరణానికి సమతుల్యమైన పరిష్కారం. సరైన ఆహార ఎంపికల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా భూమిని కూడా రక్షించవచ్చు. అయితే ఈ డైట్‌ను అనుసరించే ముందు వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా వైద్యుల సలహా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# ప్రధాన కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్!?



ఆసియా గేమ్స్ 2026 టోర్నీకి టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ దూరంగా ఉండనున్నాడు. ఈ విషయాన్ని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ టోర్నీలో భారత పురుషుల క్రికెట్ జట్టుకు బీసీసీఐ సీఓఈ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తాడని గురువారం ప్రకటించింది. జపాన్‌లోని ఐచి-నగోయా వేదికగా జరగనున్న ఆసియా గేమ్స్‌కు భారత బృందాన్ని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది. మొత్తం 768 మంది సభ్యులతో కూడిన భారత బృందంలో 503 మంది క్రీడాకారులు, 246 మంది అధికారులు, సహాయక సిబ్బంది, 19 మంది కంటింజెంట్ సిబ్బంది ఉన్నారు. ఆసియా గేమ్స్ నుంచి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు విశ్రాంతి ఇచ్చారు. అప్‌కమింగ్ సిరీస్‌ల కోసం గంభీర్‌కు రెస్ట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ 27 నుంచి వెస్టిండీస్‌తో భారత్ వైట్‌బాల్ సిరీస్ ఆడనుంది. గంభీర్ గైర్హాజరీలో వీవీఎస్ లక్ష్మణ్ జట్టును పర్యవేక్షించనున్నాడు. గంభీర్ సపోర్ట్ టీమ్ కూడా ఈ ఆసియా గేమ్స్‌కు దూరంగా ఉండనుంది. వీవీఎస్ లక్ష్మణ్‌కు సునీల్ జోషి, హృషీకేశ్ కనిత్కర్, శుభదీప్ ఘోష్ సపోర్ట్ స్టాఫ్‌గా వ్యవహరిస్తారు. మహిళల జట్టుకు అమోల్ ముజుందార్ హెడ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ఇటీవలే జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లోనూ లక్ష్మణ్ భారత జట్టుకు కోచ్‌గా సేవలందించాడు. ఇంగ్లండ్‌తో వైట్‌బాల్ సిరీస్ అనంతరం గంభీర్‌కు విశ్రాంతి ఇవ్వగా.. లక్ష్మణ్ బాధ్యతలు చేపట్టారు. ఆసియా గేమ్స్‌లో భారత పురుషుల, మహిళల జట్లు డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలోకి దిగుతున్నాయి. చైనా వేదికగా 2022 హాంగ్‌జౌ ఆసియా గేమ్స్‌లో రెండు జట్లు స్వర్ణ పతకాలు సాధించాయి. అప్పుడు పురుషుల జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ సారథ్యం వహించగా.. మహిళల జట్టును హర్మన్‌ప్రీత్ కౌర్ నడిపించింది. మరోవైపు ఆసియా గేమ్స్‌లో క్రికెట్ జట్లకు వసతి ఏర్పాట్లపై ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో జపాన్ క్రికెట్ అసోసియేషన్ సీఈవో నవోకి అలెక్స్ మియాజీ కీలక వివరణ ఇచ్చారు.

గదుల కొరత ఉన్నప్పటికీ పాల్గొనే జట్లకు హోటల్ వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 3 వరకు టీ20 క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నాయి. జట్లు కోరుకుంటే తమకు నచ్చిన వసతిని స్వయంగా ఏర్పాటు చేసుకునే అవకాశం కూడా ఉందని మియాజీ చెప్పారు. సరైన డ్రెస్సింగ్ రూమ్స్ లేకపోవడంతో పాటు వాష్ రూమ్స్ అధ్వాన్నంగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఈ వసతులపై బీసీసీఐ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి.

# రోహిత్ పై పనికిమాలిన పుకార్లు ఆపండి

## బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా




టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ వార్తలకు బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా ఫుల్‌స్టాప్ పెట్టారు. బీసీసీఐ అత్యున్నత స్థాయి సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన ఈ పుకార్లపై స్పందించారు. రోహిత్ శర్మ బాగా ఆడుతున్నాడని, ఇకనైనా ఈ పనికిమాలిన పుకార్లను ఆపేయాలని సూచించారు. ముంబైలోని బీసీసీఐ హెడ్ ఆఫీస్‌లో బుధవారం అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. దేవజిత్ సైకియా అధ్యక్షత జరిగిన ఈ సమావేశానికి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, బీసీసీఐ సీఓఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ హాజరయ్యారు. టీమిండియా భవిష్యత్తు ప్రణాళికలతో పాటు ఆటగాళ్ల గాయాల బెడద, రోహిత్ శర్మ భవితవ్యంపై చర్చించారు. ఈ సమావేశానికి చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ దూరంగా ఉన్నాడు. 2027 వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో భాగంగా యశస్వి జైస్వాల్‌కు మరిన్ని అవకాశాలు కల్పిం చేందుకు రోహిత్ శర్మను జట్టు నుంచి తప్పిస్తారనే పుకార్లను దేవజిత్ సైకియా ఖండించాడు. 'రోహిత్ శర్మ అన్ని మ్యాచ్‌ల్లోనూ చాలా బాగా ఆడుతున్నాడు. లార్డ్స్ వన్డేలోనూ సెంచరీ చేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో.. నేను ఈ పనికిమాలిన పుకార్లకు ప్రాధాన్యత ఇవ్వదలుచుకోలేదు.'అని సైకియా స్పష్టం చేశాడు. టీమిండియా ఆటగాళ్ల గాయాల బెడదపై స్పందిస్తూ.. 'రెండు నెలల పాటు ఐపీఎల్‌లో ఆడిన తర్వాత ఇంగ్లండ్‌కు వెళ్లిన 15 మంది సభ్యుల జట్టులో ముగ్గురు-నలుగురు ఆటగాళ్లు గాయపడ్డారు. సేనా (సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల పర్యటనలకు ముందు ఆటగాళ్లకు తగినంత విశ్రాంతి ఇచ్చేలా, ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడేలా వీలుగా క్రికెట్ షెడ్యూల్‌లో తగిన ఏర్పాట్లు చేస్తాం. నేషనల్ సెంటర్ ఫర్ స్పెషలైజ్డ్ ట్రైనింగ్‌లో హెడ్ ఆఫ్ స్పోర్ట్స్ సైన్స్ పదవి ఖాళీగా ఉన్నప్పటికీ, అక్కడి ఫిట్‌నెస్, పునరావస సౌకర్యాలను పర్యవేక్షించడానికి ఇప్పటికే 16 మంది అర్హత గల వ్యక్తుల విధుల్లో ఉన్నారు.'అని దేవజిత్ సైకియా పేర్కొన్నారు.

# తొలి ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ ఆతిధ్యం..





ఐసీసీ మహిళల క్రికెట్‌లో మరో ప్రతిష్ఠాత్మక టోర్నీకి తెరలేచింది. తొలిసారిగా 2027లో ప్రతిపాదించిన ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ ఆతిథ్యం ఇవ్వబోతోంది. వాస్తవానికి ఈ మెగా టోర్నీని శ్రీలంకలో నిర్వహించాలని ముందుగా నిర్ణయించారు. అయితే శ్రీలంక క్రికెట్ బోర్డులో నెలకొన్న పరిస్థితులు, ఐసీసీ సూచించిన సంస్కరణల అమలులో జాప్యం కారణంగా ఈ టోర్నీని అక్కడి నుంచి భారత్‌కు తరలించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఐసీసీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ప్రత్యామ్నాయ వేదిక కోసం భారత్‌తో పాటు బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికాలను పరిశీలించిన ఐసీసీ బోర్డు.. సెప్టెంబర్ 1న జరిగిన సమావేశంలో ఇండియాకే ఓటు వేసింది. 2027 ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు ముంబైలోని క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా, వడోదర ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ నిర్ణయంతో భారత అభిమానులకు స్వదేశంలో మరో మెగా ఈవెంట్ చూసే అవకాశం దక్కింది. రౌండ్ రాబిన్ ఫార్మాట్ ఈ ప్రతిష్ఠాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ పూర్తిగా టీ20 ఫార్మాట్‌లో జరగనుంది. ఆతిథ్య భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక జట్లు ఇందులో తలపడతాయి. లీగ్ దశలో ప్రతి జట్టు మిగతా అన్ని జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫిబ్రవరి 28న జరిగే ఫైనల్‌కు నేరుగా అర్హత సాధిస్తాయి. శ్రీలంక ఆతిథ్య హక్కులు కోల్పోయినా, టోర్నీలో ఆడే అవకాశాన్ని మాత్రం దక్కించుకుంది. మహిళల క్రికెట్‌కు ఎంతో ప్రోత్సాహం ఈ టోర్నీ మహిళల క్రికెట్‌లో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తుందని ఐసీసీ చైర్మన్ జై షా హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అత్యుత్తమ జట్లు పోటీ పడే ఈ ఈవెంట్, గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో పైకి ఎదిగేందుకు జట్లకు అద్భుతమైన స్ఫూర్తినిస్తుందని ఆయన అన్నారు. ప్రతి ఏడాదీ ఒక మెగా ఐసీసీ టోర్నీ నిర్వహించడం వల్ల మహిళల ఆటకు ఆదరణ మరింత పెరుగుతుందని జై షా ఆశాభావం వ్యక్తం చేశారు.టైటిల్ ఫేవరెట్‌గా టీమిండియా ప్రస్తుతం భారత మహిళల జట్టు వన్డే వరల్డ్ కప్ ఛాంపియన్‌గా సత్తా చాటుతోంది.

# 200 కోట్ల మార్క్ దాటిన 'ఆవారాపన్-2'




ఇమ్రాన్ హష్మి, దిశా పటానీ జంటగా దర్శకుడు నితిన్ కక్కర్ తెరకెక్కించిన యాక్షన్ స్పై థ్రిల్లర్ చిత్రం 'ఆవారాపన్ -2' బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా ప్రేక్షకుల ఆదరణతో ఏకంగా రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు సాధించి అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న దిశా పటానీ తన ఆనందాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ప్రేక్షకులందరూ ఎప్పటికీ గుర్తుంచుకునే ఒక అద్భుతమైన కథను చెప్పే ఈ ప్రయాణంలో, ఇంత మంచి మనసున్న వ్యక్తులతో కలిసి పనిచేయడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక బృందంలో భాగం కావడం ఒక గౌరవంగా భావిస్తున్నానని, 'ఆవారాపన్-2' చిత్రంపై ప్రేక్షకులు కురిపిస్తున్న అపారమైన ప్రేమకు ఎల్లప్పుడూ కృతజ్ఞురాలినై ఉంటానని తెలిపారు. ఈ స్థాయిలో ప్రేక్షకుల ఆదరణ లభించడం తన అదృష్టమని ఆనందం వ్యక్తం చేశారు. 2007లో మోహిత్ సూరి దర్శకత్వంలో ఇమ్రాన్ హష్మి, శ్రియా శరణ్ జంటగా వచ్చిన 'ఆవారాపన్' చిత్రం రూ. 18 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి కేవలం రూ. 12 కోట్లు మాత్రమే రాబట్టి ఆ సమయంలో బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. అయితే దాదాపు రెండు దశాబ్దాల తర్వాత వచ్చిన దీని సీక్వెల్ 'ఆవారాపన్-2' మాత్రం రూ. 200 కోట్ల మార్కును దాటి ఘన విజయం సాధించింది.

# దుల్కర్ సల్మాన్ లక్కీ భాస్కర్ సీక్వెల్




మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్, డైరెక్టర్ వెంకీ అట్లూరి కాంబోలో వచ్చిన బ్లాక్ బస్టర్ 'లక్కీ భాస్కర్' . ఓ సాధారణ బ్యాంక్ ఉద్యోగి మనీ లాండరింగ్, హవాలా ద్వారా ఎలా కోటీశ్వరుడిగా మారారు? తనను స్కామ్‌లో ఇరికించాలనుకున్న వారినే ఎలా ఇరికించి దేశం దాటేశారు? అనేదే ప్రధానాంశంగా సినిమా రూపొందించారు. ఈ మూవీ క్లైమాక్స్‌లోనే సీక్వెల్ ఉంటుందనే హింట్ ఇచ్చారు. త్వరలోనే లక్కీ భాస్కర్ సీక్వెల్ ఉంటుందని క్లారిటీ ఇచ్చారు డైరెక్టర్ వెంకీ అట్లూరి. 'చాలా మంది లక్కీభాస్కర్ 2 ఎప్పుడు అని అడుగుతున్నారు. సీక్వెల్ మరింత పవర్ ఫుల్ స్టోరీతో రాబోతోంది.' అని చెప్పారు. దుల్కర్ సల్మాన్ సైతం లక్కీ భాస్కర్ సీక్వెల్ కోసం తాను కూడా వెయిట్ చేస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు తాను ఏ మూవీ ఈవెంట్స్‌కు వటటల్లినా లక్కీ భాస్కర్ సీక్వెల్ కోసం వెళ్లానని... ప్రతీ ఒక్కరికీ ఆ స్టోరీ బాగా కనెక్ట్ అయ్యిందని తెలిపారు. ఫస్ట్ పార్ట్‌లో 100 కోట్ల స్కామ్‌కు పాల్పడిన వ్యక్తిగా హర్షద్ మెహతా రోల్‌ను ఇంట్రడ్యూస్ చేశారు. ఫేక్ బీఆర్స్‌తో బ్యాంక్ నగదును స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేసి భారీ కుంభకోణానికి పాల్పడిన తీరును చూపించారు. అయితే, ఆయన ఎవరు అనేది రివీల్ చేయలేదు. సీక్వెల్‌లో హర్షద్ మెహతా బ్యాగ్రౌండ్‌తో పాటు సీబీఐ ఎంక్వైరీ, భారీ స్కామ్ నుంచి తప్పించుకున్న లక్కీ భాస్కర్ మళ్లీ ఇండియాకి తిరిగివచ్చాడా? ఆ తర్వాత ఏం జరిగింది? అనేదే చూపించనున్నట్లు అర్థమవుతోంది. ఫస్ట్ పార్ట్ క్లైమాక్స్‌లో సూపర్ హింట్ ఇస్తూనే సీక్వెల్ స్టోరీపైనా క్లారిటీ ఇచ్చారు. ఫస్ట్ పార్ట్‌లో దుల్కర్ సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించారు. సాయి కుమార్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్ అందించారు. సీక్వెల్‌లో మరిన్ని రోల్స్ యాడ్ కానున్నట్లు సమాచారం.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609